మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 7 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 302 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మంచు, నాచు నిండిన కొండలపై రోబోల రేస్




2

ఫ్రాన్స్‌లో కదం తొక్కిన కార్మికులు



2

ఆహ్వానం



14 నుంచి 30 వరకు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించిన ఎన్టీవీ చైర్మన్ తుమ్మల నరేంద్ర చౌదరి

ఆహ్వానం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తన నిశితార్థ వేడుకకు ఆహ్వానించిన సినీ నటుడు తేజ సజ్జ

అభిమానం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసేందుకు కర్నూలు నుంచి హైదరాబాద్‌కు కాలినడకన వచ్చిన అభిమాని

ఆశీర్వాదం



హైదరాబాద్ జూబ్లీ కన్వెన్షన్ లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె డాక్టర్ గాయత్రి-రామ్ నాయక్ నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్

భవిష్యత్‌లో ఆదాయాన్ని పెంచాలి



వనరుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

నిర్ణీత గడువుల్లో ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలి

ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ

ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 6 (మనం బ్యూరో): రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఈ ప్రక్రియలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు స్పష్టమైన లక్ష్యాలు, శాఖల మధ్య సమన్వయం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అత్యంత అవసరమని

...మిగతా 2లో

ఫిబ్రవరి 16 నుంచి సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలు

ఢిల్లీ, నవంబర్ 6: వచ్చే ఏడాది జరగనున్న పది, 12వ తరగతి బోర్డు పరీక్షల డేట్ షీట్లను సీబీఎస్ఈ విడుదల చేసింది. ఈ పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించింది. ఈ మేరకు డేట్ షీట్లను వెబ్‌సైట్లో పెట్టింది. పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి మార్చి 9 వరకు జరుగుతాయని బోర్డు కంట్రోలర్ సన్యం భరద్వాజ్ తెలిపారు. మరోవైపు, సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు కూడా ఫిబ్రవరి 16న ప్రారంభమై ఏప్రిల్ 9 వరకు కొనసాగుతాయన్నారు. పదో తరగతిలో 83 సబ్జెక్టులు, 12వ తరగతిలో 121 సబ్జెక్టుల్లో పరీక్షలకు విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పరీక్ష తేదీలను 101 రోజుల ముందుగానే విడుదల చేశామని తెలిపారు.

ట్రంప్‌నకు.. భారతీయుల దెబ్బ



అమెరికాలో బలపడుతున్న భారత మూలవాసులు

ప్రధాన నగరాలలో అధికారం అందిపుచ్చుకున్న ఇండియన్స్

వాషింగ్టన్, నవంబర్ 6: ప్రపంచ దేశాలకు హెచ్చరికలు జారీ చేస్తూ, వాణిజ్య యుద్ధాలతో ప్రత్యర్థులను దారికి తెస్తానంటూ విరుచుకుపడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత దేశ ప్రజలే గట్టి షాక్ ఇచ్చారు. అంతే కాకుండా భారత సంతతి ఓటర్ల ప్రభావం కూడా చాలా ఉందనే వార్తలు వెలువడుతున్నాయి. చాలా చోట్ల భారత సంతతికి చెందిన వాళ్లే ఎన్నికవడం గమనార్హం. అమెరికాను అగ్రస్థానంలో నిలబెడతానని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ట్రంప్‌కు ఎదురు గాలి వీచింది. ఇప్పటికిప్పుడు ఏమీ జరగకపోయినా రాబోయే కాలానికి ఇదొక హెచ్చరికగా చూడాల్సిన పరిస్థితి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక తన విధానాలతో రాజకీయ సంక్షోభాన్ని తెచ్చిపెట్టాయి. 2026 మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించి అమెరికా కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటినీ తన ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో ట్రంప్ అధ్యక్ష పదవిలో మిగిలిన రెండేళ్ల పాలనలో ఆయనకు కాంగ్రెస్ నుంచి గట్టి ప్రతిఘటన తప్పని పరిస్థితి ఏర్పడింది. అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలపై

...మిగతా 2లో

ఐదు రాష్ట్రాల్లో తొలిసారి

భిన్నత్వంలో ఏకత్వమే బలం

వాషింగ్టన్, నవంబర్ 6: అమెరికాలో దీపావళికి ప్రాముఖ్యత పెరుగుతోంది. గత రెండేళ్లుగా ఈ మార్పు మరింత వేగవంతమైంది. 2024లో పెన్సిల్వేనియా రాష్ట్రం దీపావళిని అధికారిక సెలవుదినంగా ప్రకటించిన మొదటి అమెరికన్ రాష్ట్రంగా నిలిచింది. ఆ తర్వాత

...మిగతా 2లో

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

విద్య, సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల



2

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం
- ఓల్ సిటీ అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 6 (మనం బ్యూరో): మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్లోని ఓల్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.

గత అసెంబ్లీ సమావేశంలో మైనార్టీల అభ్యున్నతి గురించి సమీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలో భాగంగా శుక్రవారం ప్రజాభవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మైనార్టీల విద్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, విద్యాసంస్థల నిర్మాణాలు, స్టడీ సర్కిళ్ల ఏర్పాటు, ఓల్ సిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. మైనార్టీలకు విద్యా అవకాశాలను మరింత విస్తృతం చేసేందుకు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం, ఆంక్షలు ఉండబోవని భరోసా ఇచ్చారు.

నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. వివిధ రహదారుల విస్తరణ పనుల కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధుల్లో రూ.25 కోట్లను ఈ భవన నిర్మాణం కోసం కేటాయించాలని ఆదేశించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ భవనంలో మైనార్టీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్తో పాటు మైనార్టీ సంక్షేమ శాఖకు చెందిన వివిధ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యాసంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే పాఠశాలలు, స్టడీ సర్కిళ్లు, ఇతర విద్యాసంస్థలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మొఘల్పురా, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రెండు స్టడీ సర్కిళ్లకు సంబంధించి ఉన్న అడ్డంకులను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఈ రెండు ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్ల నిర్వహణకు అవసరమైన భవనాలను అందించేందుకు అక్బరుద్దీన్ ఒవైసీ సంసిద్ధత వ్యక్తం చేయగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారికంగా సమర్పించాలని కోరారు.మైనార్టీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం పరిధిని విస్తరిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఈ పథకం కింద ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే అర్హులైన విద్యార్థులు వెళ్లగలిగే దేశాల జాబితాలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన షాదీ ముబారక్ పథకం, ఇస్లామిక్ కల్చరల్ సెంటర్కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు, రాజీవ్ యువ వికాసం పథకం కింద మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ల విడుదల తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. క్రైస్తవ మైనార్టీలకు సంబంధించిన సమస్యలను సైతం పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

మైనార్టీల విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు హైదరాబాద్ ఓల్ సిటీలో మౌలిక వసతుల మెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి. షఫీఉల్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లో కదం తొక్కిన కార్మికులు

పారిస్, నవంబర్ 6: వేతనాల పెంపు కోరుతూ లక్షల మంది కార్మికులు ఫ్రాన్స్లో గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. దేశంలో కొంతకాలంగా సాగుతున్న హైస్కూల్ నిరసన ప్రదర్శనల ఉద్యమానికి వారు సంఘీభావం తెలిపారు. పారిస్, లియోన్, మార్సెయ్ తదితర ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలు జరిగాయి. దాదాపు ఆరు లక్షల మంది కార్మికులు దేశ వ్యాప్తంగా జరిగిన ర్యాలీల్లో పాల్గొన్నారని అంతర్గత వ్యవహారాల మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ ర్యాలీలలో అధికభాగం ప్రశాంతంగా ముగిశాయని అయితే లియోన్, నాంటెస్, పావ్, ఆర్లీన్స్, రెన్నెస్, టూలూస్ నగరాల్లో కొంత హింస చోటుచేసుకుందని అధికారులు వెల్లడించారు. మరోవైపు విద్యార్థులు కూడా నిరసనలు కొనసాగించారు. దేశంలో మూడోవంతు హైస్కూళ్లు సెలవు పాటించాయి.



మంచు, నాచు నిండిన కొండలపై రోబోల రేస్

బీజింగ్, నవంబర్ 6: బరువులు మోస్తూ వేల కొద్దీ మెట్లను చకచకా ఎక్కేసే మరమనుషులను ఎప్పుడైనా చూశారా? అలాంటి అద్భుతాన్ని ఆవిష్కరించేందుకు చైనా తొలి అడుగు వేసింది. మౌంట్ తాయ్ పర్వతంపై 'ది వరల్ రోబో మౌంట్ తాయ్' ఛాలెంజ్‌ను నిర్వహించింది. 90 బృందాలు తమ రోబోలతో పోటీలోకి దిగాయి. మంచు, నాచుతో జారుతున్న పురాతన రాతి మార్గంలో 3,100 రోబోలు బరువును మోస్తూ కొండపైకి వెళ్లాయి.

ఐదు రాష్ట్రాల్లో తొలిసారి ఖిన్నత్వంలో ఏకత్వమే బలం

(మొదటి పేజీ తరువాయి)

2025లో కనెక్టికట్ మరియు కాలిఫోర్నియా రాష్ట్రాలు కూడా దీనికి చట్టపరమైన గుర్తింపునిచ్చాయి. మరోవైపు, న్యూయార్క్ నగరం 2023లోనే దీపావళి రోజున ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించింది. ఈ ఏడాది, ఈ పండుగ మరో కీలక మైలురాయిని చేరుకుంది. అమెరికాలోని ఐదు రాష్ట్రాల గవర్నర్లు తమ అధికారిక నివాసాలు, రాష్ట్ర కాపిటల్ ప్రాంగణాలలో తొలిసారిగా అధికారికంగా దీపావళి వేడుకలను నిర్వహించడం విశేషం. అలాగే పసిఫిక్ వాయువ్య ప్రాంతంలోని 21 నగరాల మేయర్లు, తమ రాష్ట్ర రాజధానులలో, గవర్నర్ నివాసాలలో మరియు నగర పాలక కార్యాలయాలలో మొదటిసారిగా దీపావళి వేడుకలను నిర్వహించారు. వ్యాపార, ప్రజాసేవ, సాంస్కృతిక రంగాలలో భారతీయ అమెరికన్ల ప్రాముఖ్యతను, వారు అందిస్తున్న సేవలను అభినందించారు. ఐడాహో, నెబ్రాస్కా, మోంటానా, నార్త్ డకోటా, వాషింగ్టన్ రాష్ట్రాలలో ఈ వేడుకలు జరిగాయి.

భవిష్యత్ ఆదాయాన్ని పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి శాఖ వారాలవారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు.

పారిశ్రామిక లేఅవుట్లు, పాత పారిశ్రామికవాడల్లో భూముల వినియోగం, క్రమబద్ధీకరణ ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటికే సమకూరిన ఆదాయం, వివిధ దశల్లో ఉన్న ప్రతిపాదనల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. పారిశ్రామిక భూములకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు.

అజామాబాద్, బాలానగర్, హఫీజ్పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్లవారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. బీ-కేటగిరీ, సూక్ష్మ పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించడంతో పాటు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలను నిర్ణయించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలను అప్పగించాలని సూచించారు. రోజువారీ పురోగతిని పర్యవేక్షించడం ద్వారా పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన, సులభతరమైన సేవలు అందేలా చూడాలన్నారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి దోహదపడుతుందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ పరిసరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, ముఖ్యంగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్, భవిష్యత్ అవసరాలకు భూముల లభ్యత, భూ వనరుల సమీకరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో పాల్గొనే అన్ని వర్గాలకు స్పష్టతతో పాటు ప్రయోజనం కలిగేలా ప్రణాళికాబద్ధమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలన్నారు.

ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి సమకూరే భూ వనరులను అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, అదనపు ఆదాయం సమకూర్చే మార్గాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ భూముల వినియోగంలో ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వ వాటాగా లభించే భూములను నిర్దిష్ట ప్రజా అవసరాలకు వినియోగించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలను చట్టపరమైన నిబంధనలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలను మంత్రివర్గ పరిశీలనకు సమర్పించాలని సూచించారు.

హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను కూడా ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు.

వేలానికి అనువైన లేఅవుట్లను గుర్తించాలని, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం, అభివృద్ధికి అవకాశాలు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూముల వేలం ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భూముల వివరాలు, లేఅవుట్ల ప్రస్తుత స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, ముందస్తు ఏర్పాట్ల పురోగతి తదితర అంశాలతో కూడిన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభుత్వ భూములు, లేఅవుట్ల అభివృద్ధి, వేలం సంబంధిత కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్బోర్డ్ రూపొందించాలని సూచించారు.

భూముల వివరాలు, లేఅవుట్ల స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతి వంటి సమగ్ర సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్తుల విలువను పెంచడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం, ఆదాయ సమీకరణకు కొత్త మార్గాలను గుర్తించడం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.రాష్ట్ర వనరులను సమర్థంగా సమీకరించడం ద్వారా తెలంగాణ ఆర్థిక వృద్ధి, సమగ్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గ్లోబల్ వాల్యూ క్రియేషన్ కేంద్రంగా హైదరాబాద్



కంపెనీల కార్యకలాపాల విస్తరణకు సహకారం

- టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా జీసీసీలను తీర్చిదిద్దుతాం
- 'పికో టెక్నాలజీ ఇండియా' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు
- యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, నవంబర్6 (మనం బ్యూరో): గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కీలక కార్యకలాపాలు, పరిశోధన, ఉత్పత్తుల అభివృద్ధికి హైదరాబాద్ ను తమ గమ్యస్థానంగా మార్చుకునేలా అన్ని విధాలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. న్యూయార్క్ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థలకు టెక్నాలజీ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్వేర్, డేటా, అనలిటిక్స్ సేవలు అందించే పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయాన్ని హైటెక్ సిటీలో శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో పికో సంస్థ ప్రతినిధులతో హైదరాబాద్లో పెట్టుబడులు, సంస్థ విస్తరణపై జరిగిన చర్చలు కార్యరూపం దాల్చడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ లో గ్లోబల్ కంపెనీల కార్యకలాపాల విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఏడాది వ్యవధిలో హైదరాబాద్ లో 100 కొత్త జీసీసీలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా గ్లోబల్ టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ప్రొడక్ట్ డెవలప్మెంట్, ఇంజినీరింగ్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర రంగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటికి మార్గ నిర్దేశం చేస్తున్నామన్నారు. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పికో సంస్థ 350కి పైగా సంస్థలకు సేవలు అందిస్తోందన్నారు. 'పికో టెక్నాలజీ హైదరాబాద్లో కార్యకలాపాలను విస్తరించడం స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుంది.

పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపకుడు, సీఈఓ జారోడ్ యుస్టర్, సీఐఓ సీతారాం గొర్రె, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మాట్ నార్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ ప్రధానిగా ఐసెన్‌కోట్? అరబ్బు పార్టీల మద్దతు

జెరూసలెం, నవంబర్ 6: ఇజ్రాయెల్ తదుపరి ప్రధానిగా విపక్షనేత గడీ ఐసెన్‌కోట్ ఎన్నిక దాదాపు ఖరారైంది. దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో గురువారం సంప్రదింపులు జరిపిన అరబ్బు పార్టీలు మొదటగా ఐసెన్‌కోట్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం కల్పించాల్సిందిగా సిఫార్సు చేశాయి. ఆయనకు మొత్తం 67 మంది సభ్యుల మద్దతు లభించే అవకాశం ఉండగా ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు 46 మంది సభ్యుల మద్దతు మాత్రమే దక్కింది. నెతన్యాహుకు దీర్ఘకాలంగా మిత్రపక్షంగా ఉన్న యునైటెడ్ తోరా జుడాయిజం (యుటీజే) పార్టీ ఈసారి ఆయనకు మద్దతు ప్రకటించేందుకు నిరాకరించింది.

పీట్ హెగ్సెత్‌పై వేటు?

- సన్నిహితులతో ట్రంప్ సమాలోచనలు
- వాన్స్ సొంతబాట..
- అమెరికాలో ఆసక్తికర పరిణామాలు



వాషింగ్టన్, నవంబర్ 6: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో పరాజయానంతరం రిపబ్లికన్పార్టీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధ్యక్షుడు ట్రంప్ తన పరువునిలబెట్టుకునేందుకు దారులు వెదుకుతుండగా... 2028 అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్... సొంతబాట వేసుకోవటం ఆరంభించారు. ఇరాన్ యుద్ధమే తమ కొంపముంచిందని అంగీకరించిన అధ్యక్షుడు ట్రంప్... తన రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌పై వేటుకు యోచిస్తున్నారు. హెగ్సెత్‌ను తీసి వేసే విషయమై అంతర్గత చర్చలు జరుగుతున్నాయని శ్వేతసౌధం వెల్లడించింది. ఇరాన్‌పై యుద్ధానికి హెగ్సెత్ సూచనలే కారణమంటూ ట్రంప్ గతంలో వ్యాఖ్యానించటం గమనార్హం. తాజాగా ట్రంప్ తన సన్నిహిత సలహాదారులతో ఫోన్ సంభాషణలు, సంప్రదింపుల సమయంలో ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిపింది. ఒకవేళ హెగ్సెత్‌ను తప్పిస్తే, ఆ స్థానంలో ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌ను నియమించే అవకాశం ఉందని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి.

అసంతృప్తులతో కలసి వాన్స్..


ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సొంతంగా రాజకీయ ప్రచారం చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ట్రంప్‌పై అసంతృప్తితో ఉన్న ఓటర్లను ఆకట్టుకోవడానికి ఆయన ఈ దిశగా ప్రయత్నిస్తారని తెలుస్తోంది. అందులో భాగంగా విదేశాంగ విధానం, ఇజ్రాయెల్ పట్ల అమెరికా అనుసరిస్తున్న దౌత్యపరమైన వైఖరిపై ఆయన భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం.అయితే డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న జాతీయవాద విధానాలకు మద్దతిస్తూనే.. ప్రస్తుత విదేశాంగ విధానాలపై అసంతృప్తిగా ఉన్న గ్రూపులను చేరదీయడానికి జేడీ వాన్స్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

గ్రామపంచాయతీల ఆదాయం ఇక నేరుగా

గ్రామపంచాయతీ ఖాతాల్లోనే

చట్ట సవరణ అమలుకు ఉత్తర్వులు జారీ..

- గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం
- ఉత్తర్వులు వెలువడటం పట్ల మంత్రి సీతక్క హర్షం
- పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 6 (మనం బ్యూరో): గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఇకపై ట్రెజరీలో జమ కాకుండా నేరుగా గ్రామపంచాయతీల సొంత ఖాతాల్లోనే జమ అయ్యేలా చేసిన చట్ట సవరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను అక్టోబర్ 9, 2026 నుంచి అమల్లోకి తీసుకొస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 43ను శుక్రవారం నాడు జారీ చేసింది. గతంలో గ్రామపంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయం ట్రెజరీ ద్వారా ఖర్చు చేయాల్సి రావడంతో గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రావడంలో జాప్యం జరిగేది. అత్యవసర పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, రహదారులు, ఇతర స్థానిక అవసరాల కోసం గ్రామపంచాయతీలు నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది.గ్రామాల అవసరాలకు అనుగుణంగా సొంత ఆదాయాన్ని వేగంగా వినియోగించుకునేలా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. మంత్రి సీతక్క చొరవతో గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వావలంబన పెంచే దిశగా తీసుకున్న ఈ నిర్ణయానికి ఇప్పుడు అమలు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామపంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి ఖాతాల్లోనే జమ కావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది.గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీలే మరింత బాధ్యతతో నిర్ణయాలు తీసుకునేలా, స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛను పెంచే దిశగా ఈ చట్ట సవరణ కీలక అడుగుగా ప్రభుత్వం పేర్కొంది.చట్ట సవరణ ఉత్తర్వులు వెలువడటం పట్ల మంత్రి సీతక్క హర్షం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు అని వ్యాఖ్యానించారు.

ట్రంప్‌నకు..భారతీయుల దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

డెమొక్రాట్లు పట్టు సాధించడం ట్రంప్‌నకు ఎదురుదెబ్బ. సెనేట్లో డెమొక్రాట్లు 54-44 ఆధిక్యాన్ని సాధించగా, ప్రతినిధుల సభలోనూ కనీసం 30 స్థానాలను అదనంగా గెలుచుకున్నారు. రిపబ్లికన్లకు కంచుకోటలుగా భావించే రాష్ట్రాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు నమోదు చేయడం ఈ ఎన్నికల ప్రత్యేకత. ట్రంప్‌నకు మద్దతుగా నిలిచిన ప్రాంతాల్లోనే ఓటర్లు పార్టీకి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం అమెరికా రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది.

ఇరాన్ యుద్ధమేనా?

ఈ ఓటమికి ఇరాన్‌తో యుద్ధం, ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు వంటి విదేశాంగ విధానాలు కూడా కారణమయ్యాయి. యుద్ధ పరిణామాలతో ఇంధన ధరలు పెరగడం, అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొనడం అమెరికా ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. అయితే ట్రంప్ ఓటమికి యుద్ధం ఒక్కటే కారణం కాదని రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. అమెరికా ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసిన అంశం నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, కుటుంబాలపై పెరిగిన ఆర్థిక భారం.

ట్రంప్ తన రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత 'అమెరికా ఫస్ట్' నినాదంతో వాణిజ్య విధానాలను మార్చడం ప్రారంభించారు. 2025 ఏప్రిల్ 2న వివిధ దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై పరస్పర సుంకాలను ప్రకటించారు. విదేశాలు దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్నాయని, దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా అమెరికా పరిశ్రమలకు రక్షణ కల్పిస్తామని ప్రకటించారు. ట్రంప్ వాణిజ్య విధానాల ప్రభావం భారత్పైనా తీవ్రంగా పడింది. భారతీయ వస్తువులపై తొలుత 26 శాతం పరస్పర సుంకాలను ప్రకటించిన అమెరికా తర్వాత దాన్ని 25 శాతానికి సవరించింది. ఆ తర్వాత రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ మరో 25 శాతం అదనపు సుంకాన్ని విధించింది. దీంతో పలు భారతీయ ఉత్పత్తులపై మొత్తం సుంకాల భారం 50 శాతానికి చేరింది. దీంతో అమెరికా మార్కెట్ట ఆధారపడిన భారతీయ ఎగుమతిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ ఈ నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని ఆర్థిక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

అమెరికా ప్రజలు ఓటు వేసే సమయంలో అంతర్జాతీయ రాజకీయాల కంటే తమ కుటుంబ బడ్జెట్కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్ ఖర్చులు, బీమా ప్రీమియాలు, ఇంటి ఖర్చులు, ఇతర అవసరాల కోసం పెరుగుతున్న వ్యయం ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలు విదేశీ దేశాలకు శిక్షగా మారతాయని ప్రభుత్వం ప్రచారం చేసినప్పటికీ, వాటి ప్రభావం అమెరికా మార్కెట్లో వస్తువుల ధరలపై పడింది. దీంతో 'అమెరికా ఫస్ట్' నినాదం కంటే 'మా కుటుంబాల ఆర్థిక పరిస్థితి ముందు' అనే ఆలోచన ఓటర్లలో బలపడింది.

ఇదిలా ఉండగా.. ట్రంప్‌నకు భారతీయ అమెరికన్ల నుంచి గతంలో లభించిన మద్దతులో కొంత భాగం ఇప్పుడు తగ్గినట్లు సర్వేలు సూచిస్తున్నాయి.

భారత్‌పై సుంకాలు, వలస విధానాలు, ఆర్థిక అంశాలపై అసంతృప్తి ఈ మార్పునకు కారణమయ్యాయి. భారతీయ మూలాలున్న నేతలు కూడా అమెరికా రాజకీయాల్లో తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకుంటున్నారు. మొత్తంగా చూస్తే.. అమెరికా రాజకీయాల్లో భారతీయుల ప్రాధాన్యత పెరుగుతున్న వేళ, ట్రంప్‌నకు వ్యతిరేకంగా వారి ఓటింగ్ ధోరణిలో వచ్చిన మార్పు డెమొక్రాట్లకు అనుకూల పరిణామంగా నిలిచింది.

ప్రతిపక్ష నేతలు ప్రశ్నించే హక్కు లేదా?

బాలరాజు యాదవ్ అరెస్టు అప్రజాస్వామికం
అరెస్ట్‌లు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
ఆయనను వెంటనే విడుదల చేయాలి: కర్నె ప్రభాకర్



హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ నేత బాలరాజు యాదవ్ అరెస్టును ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఖండించారు. ప్రభుత్వంలోని బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు చేస్తున్న నిరాధార రాజకీయ ఆరోపణలను ప్రశ్నించినందుకే బాలరాజును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగా సమాధానం ఇచ్చిన బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు చేస్తున్న ఆరోపణలను ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించే హక్కు లేదా? అని నిలదీశారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరమా? అని ప్రశ్నించిన కర్నె ప్రభాకర్.. అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తుంటే, వాటికి రాజకీయంగా సమాధానం ఇచ్చే వారిపై పోలీసు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. బాలరాజు యాదవ్‌పై అక్రమ కేసులు నమోదు చేయకుండా, ఆయనను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు సమాధానం విమర్శలతోనే ఇవ్వాలని, పోలీసు చర్యలతో కాదని అన్నారు. రాజకీయ భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. బాలరాజును తక్షణమే విడుదల చేయాలని కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు

కేటీఆర్ బల్మూరి మధ్య మాటల యుద్ధం

- **రియల్టర్లను ప్రభుత్వం బెదిరిస్తోందని కేటీఆర్ విమర్శ**
- **వారిని రానివ్వకుండా చేస్తోంది మీరు కాదా ?**
- **కేటీఆర్‌కు బల్మూరి స్ట్రాంగ్ కౌంటర్**



హైదరాబాద్, నవంబర్ 06, (మనం బ్యూరో) : కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది . కేటీఆర్ ఎప్పుడు ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించినా వెంటనే బల్మూరి స్పందించి దీటైన కౌంటర్ ఇస్తున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ముందుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట ప్రభుత్వం బెదిరిస్తోందని కేటీఆర్ విమర్శలు గుప్పించగా, రియల్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తూ మురుస్తున్నారంటూ బల్మూరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వాళ్లు రావాలంటేనే భయపెట్టేలా కేటీఆర్ టీమ్ పని చేస్తుందని మండిపడ్డారు. కేటీఆర్ ఓ బ్లాక్ మెయిలర్, డబ్బుల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరిస్తున్నారని ఆయన బాధితులు ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అంతకు ముందు కేటీఆర్ రియల్టర్ జీవీ రావుకు చెందిన ఎస్ఏఎస్ కంపెనీని ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో వేధిస్తున్నారని ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. అంతేకాకుండా ఆ తరువాతి రోజు ఆ పార్టీకి చెందిన దినపత్రికలో ప్రత్యేక కథనం వచ్చింది. దీనిపై బల్మూరి వెంకట్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో కేటీఆర్ అండ్ టీం ప్లాన్ ప్రకారమే పెట్టుబడిదారులను, వ్యాపారులను బెదిరిస్తున్నారని ఆరోపించారనీ, ఓ విషయంపై ముందు కేటీఆర్ ట్వీట్ పెట్టిన తరువాత వాళ్ల అనుకూల మీడియా హడావుడి చేస్తుందని ధ్వజమెత్తారు. జీవీ రావుకు చెందిన ఎస్ఎఎస్ కంపెనీ విషయంలోనూ అదే జరిగిందనీ, అసలు ఆ కంపెనీ ఓనర్ జీవీ రావును కన్‌స్ట్రక్షన్ కంపెనీలోకి తీసుకొచ్చిందే కేటీఆర్ అని స్పష్టం చేశారు. 2018లో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలోనే సదరు కంపెనీకి అనుమతులు ఇచ్చారనీ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు జీవీ రావును డబ్బులు అడిగిన విషయం వాస్తవం కాదా ? అంటూ ప్రశ్నించారు. వరంగల్ రైతు గర్జన సభకు కూడా డబ్బులు ఇవ్వాలని బెదిరించారనీ, ఆయన డబ్బులు ఇవ్వడానికి ఒప్పుకోకపోతే ఇలా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌పై తాను చేసే ప్రతి ఆరోపణకు ఆధారాలు ఉన్నాయనీ, కాదని చెప్పే దమ్ము కేటీఆర్‌కు ఉందా అని నిలదీశారు. ఇప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు పువ్వు పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారనీ, ఇప్పటికైనా కేటీఆర్ బుద్ధి మార్చుకోని పక్షంలో ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందని బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

రాజకీయ విమర్శలకు పోలీసు కేసులు దుర్మార్గం

బాలరాజు యాదవ్‌పై అట్రాసిటీ కేసు, అరెస్ట్.. రాజకీయ కక్ష సాధింపే
అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు?..
కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
బాలరాజుపై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలి?
ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయలేరు?
అరెస్టును ఖండించిన కేటీఆర్, హరీశ్ రావు



హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

ఐపీఈ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ లింబాద్రి

- **బాధ్యతల స్వీకరించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్**



హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారి వంటి పలు విశిష్ట పదవులను నిర్వహించారు. అయితే, ప్రస్తుతం ఏపీ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీకి అంబుడ్స్‌మన్‌గా పనిచేస్తున్నారు. విస్తృతమైన విద్యా అనుభవం, పరిపాలనా నైపుణ్యం, సంస్థ యొక్కవిద్యా నైపుణ్యాన్ని, పరిశోధనా కార్యక్రమాలను , సంస్థాగత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో లింబాద్రి సేవలందిస్తారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

ప్రభుత్వం దీపావళి కానుక

- **భారీగా తగ్గిన మెట్రో ఆర్‌టీసీ కామన్ పాస్ ధరలు**
- **నగర వాసులకు భారీ ఊరట**
- **నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 నుంచి రూ.4,000కి తగ్గింపు**
- **రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కి తగ్గించిన సర్కార్**
- **దీపావళి కానుక రేపటి నుంచి అమలులోకి రానున్న కొత్త ధరలు**

హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉద్దేశించిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ధరలు రేపటి (నవంబర్ 8)నుంచి అమలులోకి రానున్నాయి.

తెలంగాణ సర్కార్ తాజా నిర్ణయంతో గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ కామన్ పాస్ ధర ఇప్పుడు రూ. 4,00 కాశం ఉంటుంది. అదేవిధంగా రూ. 400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ. 275కి తగ్గించారు. ఇందులో రూ. 200 మెట్రోకు, రూ. 75 ఆర్‌టీసీకి చెల్లించాల్సి 0కి తగ్గింది. ఇందులో రూ. 3,000 మెట్రోకు, రూ. 1,000 టీజీఎస్ఆర్‌టీసీకి కేటాయించారు. ఈ పాస్‌తో నెలలో 50 రౌండ్ ట్రిప్పులు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ పాస్‌పై రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ధరలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

నిత్య ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలు ఎక్కువగా ప్రజా రవాణాను వినియోగించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. కాగా, మెట్రో, ఆర్‌టీసీ ప్రయాణాల కోసం ఒకే కార్డును వినియోగించే ఈ కామన్ పాస్ను అక్టోబర్ ప్రారంభంలో ప్రవేశపెట్టారు. అయితే, అప్పట్లో నిర్ణయించిన ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఎకరం అమ్మినట్టు రుజువు చేయ్?..
మీ ఇంట్లో ఊడిగంజేస్త

కూకట్‌పల్లి భూములపై రేవంత్ ప్రభుత్వానికి మాధవరం సవాల్



హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : కూకట్‌పల్లి భూముల వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బహిరంగ సవాల్ విసిరారు. కూకట్‌పల్లిలో తానూ ఒక్క ఎకరం భూమి అమ్మినట్లు నిరూపిస్తే, వారి ఇంట్లో ఊడిగం చేయడానికి సిద్ధమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము పోరాడి సాధించిన మియాపూర్ భూములపై కోర్టు ఆర్డర్ కాపీ రాకముందే, ప్రభుత్వం వేలానికి సిద్ధమైందని మాధవరం ఆరోపించారు. హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను కూడా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని, ఇవన్నీ పేదలకు చెందినవని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తూ, ఆయనకు హైదరాబాద్ నగరంపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఇదిలాఉంటే, 'చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లు ఖర్చు పెడుతూ, మరోవైపు వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం ఎంతవరకు సమంజసం?' అని మాధవరం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలకు చెందిన భూముల అమ్మకం విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోబోమని కృష్ణారావు స్పష్టం చేశారు. ఇక, ఈ వ్యవహారాన్ని తానూ ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోనని, తన పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

దీపావళి వేళ దక్షిణ మధ్య రైల్వే అలర్ట్

బాణసంచా, పేలుడు పదార్థాలను రైళ్లలో అస్సలు తీసుకురావద్దంటూ రిక్వెస్ట్
నిబంధన ఉల్లంఘిస్తే? రూ.1,000 జరిమానా.. మూడేళ్ల జైలు శిక్ష
భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని సూచన



హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : దీపావళి పండుగ నేపథ్యంలో రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం కీలక హెచ్చరిక జారీ చేసింది. రైళ్లలో, రైల్వే స్టేషన్లలో బాణసంచా, పేలుడు పదార్థాలు, మండే స్వభావం కలిగిన వస్తువులను తీసుకెళ్లవద్దని స్పష్టం చేసింది. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా భద్రతా చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు దీపావళి సందర్భంగా రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్లు, రైళ్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించడంతో పాటు నిఘా చర్యలను పెంచారు. బాణసంచా, మండే స్వభావం కలిగిన ద్రవ పదార్థాలు, పేలుడు పదార్థాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులను రైల్వే ప్రాంగణాల్లోకి తీసుకురావడం ప్రమాదకరమని రైల్వే అధికారులు హెచ్చరించారు.

రూ.1,000 జరిమానా.. మూడేళ్ల జైలు శిక్ష..

నిషేధిత వస్తువులను రైళ్లలో రవాణా చేయడం రైల్వే చట్టం-1989లోని సెక్షన్ 164 ప్రకారం నేరమని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నిబంధన ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా రూ.1,000 జరిమానా లేదా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా ఈ రెండూ విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రయాణికులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. రైళ్లలో లేదా రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా ఉన్న పేలుడు పదార్థాలు, మండే స్వభావం కలిగిన వస్తువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని రైల్వే అధికారులకు సమాచారం అందించాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది. రైల్వే సెక్యూరిటీ హెల్ప్‌లైన్ నంబర్ 139కు ఫోన్ చేయడంతో పాటు రైల్ మదద్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. పండుగ సమయంలో ప్రయాణాలు సురక్షితంగా, సజావుగా సాగేందుకు రైల్వే సిబ్బందికి సహకరించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేసింది. ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఆకాంక్షించింది.

కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపు

- **చేతగాకనే చేతులెత్తేసినవ్?**
- **రెండో పంట వేయవద్దన్న రేవంత్‌కి 2వ సారి ఓటు వేయొద్దు**
- **ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపించారు. పాలన చేతకాక చేతులెత్తేసి రెండో పంట వేయవద్దన్న రేవంత్‌రెడ్డికి ప్రజలు రెండోసారి ఓటు వేయవద్దని కోరారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు కక్ష సాధింపుతో మరమ్మత్తులు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్కు కాళేశ్వరం గుర్తుకు వచ్చిందని ఆరోపించారు. కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ఏ నిర్ణయం రాకుండానే సంబురాలు చేసుకున్నారని పేర్కొన్నారు. మేడిగడ్డ మరమ్మతులు చేయడానికి మూడు నెలలు పట్టదని,మూడేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు రిపేర్లు అంటూ కాయాపన చేస్తున్నారని ఆరోపించారు.అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్‌లు మంచిగానే ఉన్నాయని సెంట్రల్ వాటర్ రిసోర్స్ సంస్థ చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేక, నీటిని నింపుకోలేక ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాల వల్ల హైదరాబాద్ నగరానికి త్రాగు నీటి కష్టాలు మొదలయ్యాయని ,ఇప్పటికే 2 లక్షల 30 వేల ట్యాంకర్లు వాడారని పేర్కున్నారు. సీఎం పీఠంపై కూర్చునే వ్యక్తులకు విశాల దృక్పథం ఉండాలని సూచించారు. రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభిస్తే కేసీఆర్ కొనసాగించారని గుర్తు చేశారు.కేసీఆర్ ఆనవాళ్లు తుడపడం రేవంత్ రెడ్డితో సాధ్యం కాదని స్పష్టం చేశారు.ళేశ్వరం. ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉన్నామని,అసెంబ్లీలో మాకు మైక్ కట్ చేయకుండా సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏదో ఒక రకంగా మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని దుయ్యబట్టారు.

కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మరమ్మతులు చేయలేదు.. రేవంత్ రెడ్డిపై సుధీర్ రెడ్డి ఫైర్

ఇప్పటికే నగరంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయని, 2 లక్షల 30 వేల ట్యాంకర్ల నీటిని వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కేసీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి చివరకు బొక్కబోర్లా పడ్డారని విమర్శించారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న వ్యక్తికి విశాల దృక్పథం ఉండాలని హితవు పలికారు. తెలంగాణలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లను చెరపడం రేవంత్ రెడ్డి వల్ల సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే సభలో తమకు మైక్ కట్ చేయకుండా మాట్లాడేందుకు తగిన సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏదో ఒక కారణంతో బీఆర్ఎస్ సభ్యులను అసెంబ్లీకి రాకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని టార్గెట్లు పెట్టుకున్నా ఆయన ప్రయోగించిన బుల్లెట్లు లక్ష్యాన్ని చేరడం లేదని వ్యాఖ్యానించారు. ఏపీకి నీళ్లు వెళ్లలేదని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు అసెంబ్లీలో సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.



కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు
ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే
రేవంత్‌పై హరీశ్ ఫైర్





హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రసృష్టి'' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

కల్తీ పాల గుట్టురట్టు

రసాయనాలతో తయారుచేసిన కల్తీ పాలు హైదరాబాద్‌కు సరఫరా
రంగారెడ్డి జిల్లా పోచారంలో కల్తీ పాల కేంద్రంపై దాడి
నిందితుడిని అరెస్ట్ చేసి 100 లీటర్ల కల్తీ పాలు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 6, మనం ప్రతినిధి : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాల దందాను మహేశ్వరం జోన్ ఎస్ఓటి పోలీసులు బట్టబయలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేసి, భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. పోచారం గ్రామానికి చెందిన ఆండే శ్రీశైలం (43) అనే వ్యక్తి తన ఇంట్లోనే రహస్యంగా ఈ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పాల పొడిలో నీళ్లు, ప్రమాదకరమైన రసాయనమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కలిపి సింథటిక్ పాలను తయారు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పక్కా సమాచారం అందుకున్న ఎస్ఓటి బృందం మెరుపుదాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. అయితే, ఘటన స్థలం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, 35 కిలోల 'ధోల్‌పూర్' బ్రాండ్ పాలపొడి, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. శ్రీశైలంపై కేసు నమోదు చేసి, ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ కల్తీ పాల సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపూర్ణ తల్లీ ఆదుకోవమ్మా !


పేదవాడి పరిస్థితి -
'అన్నమో రామచంద్రా' అయ్యేలా ఉంది
ప్లేటులో మెతుకు లేక-
కడుపు - కాలిపోయేలా ఉంది !
ప్రభుత్వం అంటోంది -
'బియ్యం పుష్కలంగా -ఉన్నాయని'
ధైర్యం చెబుతోంది 'భయం-వద్దని'!
కానీ -బయట -కథే -వేరలా ఉంది
రైస్ మిల్లర్ల -కుమ్మక్కు -బయట పడింది !
గోడౌన్లలో -బియ్యం -దాచేసి
కృత్రిమ కొరత - సృష్టించారు !
ధరలు పెంచి -ఇష్టానుసారంగా
అమ్ముకుంటున్నారు,
అధికారులు చూస్తున్నా
అమ్మేవాళ్లు అమ్ముకుంటున్నారు !
ఖజానా నింపుకుంటున్నారు
అన్నపూర్ణ అన్న- ఈ దేశంలో..అన్నం కొరతనా?
అన్నం పెట్టే దేశంలో ఆకలి చావులా ?
ఇది ఏమి ఘోరం -ఏమి దారుణం,
పేదోడి కడుపు మీద - ఇది దోపిడీ కాదా?
అయ్యో... అన్నపూర్ణ తల్లీ...
ఆదుకోవమ్మా, నీ బిడ్డల
ఆకలి - తీర్చవమ్మా!
మిల్లర్ల గుండెల్లో - కాస్త
కరుణ నింపమ్మా,
పేదోడి ఇంట - మళ్ళీ
అన్నం - పండించమ్మా!
ఇది ప్రతి పేదవాడి
కడుపులోని ఆకలి కేక !!

-'కావ్యసుధ'
9247313488

ఎత్తిన ఎల్‌నినో..దించిన ఆర్నాబ్ మురుసు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా వాతావరణం మారి పోయింది. అక్టోబర్ మూడో వారం వరకు ఎండలు, తీవ్రమైన ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు, అక్టోబర్ చివరి వారం నుంచి తుఫానుల ప్రభావంతో కమ్ముకున్న మేఘాలు, చిరు జల్లులు ఉపశమనం కలిగించాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. ప్రకృతిలో చోటుచేసుకునే ఇటువంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల వల్ల మొదటగా ప్రభావిత మయ్యే రంగాల్లో విద్యుత్ రంగం ఒకటి. అయితే, తుఫానుల ప్రభావంతో మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా తెలంగాణలో విద్యుత్ డిమాండ్ తగ్గగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీభత్సమైన ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సంస్థలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది.

ఎల్‌నినో కారణంగా ప్రపంచ వాతావరణ సరళి మారి పోయింది. భారతదేశంలో దీని ప్రభావం తీవ్రంగా కనిపిస్తుంది. తగినంత వర్షాలు కురువక దాదాపు సగానికి పైగా రాష్ట్రాలలో లోటు వర్షపాతం నమోదైంది. లోటు వర్షాభావంతో రిజర్వాయర్లలో కనీస నీటి నిల్వలు లేవు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. వర్షాలు లేకపోవడంతో పాటు పెరిగిన ఎండల తీవ్రత, రాత్రి సమయంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ అసమాన వాతావరణ పరిస్థితులకు విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. లోటు వర్షపాతంతో రైతులకు నీటి అవసరం పెరిగడంతో వ్యవసాయ వినియోగం పెరిగింది ఎండలు ఉక్కపోతతో ఏసీలు, కూలర్లు వంటి శీతలీకరణలా వాడకం పెరగడంతో గృహ వినియోగం పెరిగి చాలా రాష్ట్రాలు ఎన్నడూ లేని గరిష్ఠ డిమాండ్ను చేరుకున్నాయి. తెలంగాణలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 20000 మెగా వాట్లు దాటింది. సెప్టెంబర్ మొదటి వారం నుండి అక్టోబర్ మూడో వారం వరకు రోజుకు సుమారు18 నుంచి 19 వేల గరిష్ఠ



విద్యుత్ డిమాండ్ నమోదైంది. అక్టోబర్ 15 ,16న 20 వేల మెగావాట్లు దాటింది.

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నాబ్ అల్ప పీడనం, వాయుగుండంగా మారి అక్టోబర్ చివరి వారానికి తీవ్ర మైన తుఫానుగా పరిణామం చెందింది. దీని ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్ లో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిస్తే తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌లో అక్కడ అక్కడ మోస్తరు వర్షాలు కురిసి రాష్ట్రమంతటా మేఘావృతమై వాతావరణం చల్లబడింది. ప్రస్తుతం ఆర్నాబ్ ప్రభావం తగ్గి నవంబర్ ఒకటి నుండి మురుసు తుఫాన్ ప్రభావం కొనసాగుతుంది. ఇది పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళ నాడు రాష్ట్రాలను ప్రభావితం చేయనుంది. ఈ తుఫానుల ప్రభావంతో చల్లబడిన వాతావరణం వల్ల ఏసీలు, కూలర్ల అవసరం తగ్గి గృహ వినియోగం తగ్గింది. అలాగే చిరు జల్లులు, మోస్తరు వర్షాలతో కొంత మేర వ్యవసాయ విద్యుత్ వినియోగం సైతం తగ్గింది. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా విద్యుత్ డిమాండ్ 5 వేల మెగావాట్ల వరకు తగ్గింది. అక్టోబర్ చివరి వారం నుండి ఇప్పటి వరకు సగటు గరిష్ఠ డిమాండ్ సుమారు 14 వేల మెగావాట్ల వరకు నమోదవుతుంది.

ప్రస్తుత అల్పపీడన ప్రభావం ఆంధ్రప్రదేశ్లో విద్యుత్ రంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. అయితే, తుఫాను ప్రభావిత రాష్ట్రాలతో పాటు తెలంగాణలో కొంత మేర విద్యుత్ డిమాండ్ను తగ్గించిందని చెప్పవచ్చు. అక్కడక్కడ కురిసిన మోస్తరు వర్షాలతో వ్యవసాయ విద్యుత్ డిమాండ్ తగ్గడంతో పాటు, చల్లబడిన వాతావరణం కారణంగా గృహ విద్యుత్ వినియోగం కూడా కొంత మేర తగ్గింది. దీనికి తోడు, రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగు చేసే తొలి దశ వరి పంట, మొక్కజొన్న చేతికి రావడం, పత్తి పంటకు నీటి అవసరం తగ్గడం కూడా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ తగ్గడానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

జల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులో లేని పరిస్థితుల్లో, బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం నుంచి విద్యుత్ సంస్థలకు కొంతమేర ఆర్థిక ఉపశమనం లభించే అవ కాశం ఉంది. సాధారణంగా ఏడాదిలో ఖరీఫ్ సీజన్లో సెప్టెంబర్- అక్టోబర్ నెలల్లో, అలాగే రబీ సీజన్లో మార్చి-ఏప్రిల్ నెలల్లో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ నమోదవుతుంది. తొలి దశ గండం నుంచి గట్టెక్కినప్పటికీ, మలి దశ సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని యంత్రాంగాలు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.

- బైరబోయిన వెంకటేశ్వర్లు
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ల సంఘం

రైతాంగ ఉద్యమ పిత ఆచార్య రంగా

గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు.

ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు.సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతి నిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరోస్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఎన్.జి. రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 - జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమరయోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొన సాగారు.

రంగా, 1900, నవంబరు 7న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది. 1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రేస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై 'బాపు దీవెనలు' అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు.

ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు.1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్ర బాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత



పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు.1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు.

1938 నాటికే ఇందులాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు.

గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసులోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు.

రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగన్లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీకి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు.

నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు.


1946లో కోపెన్‌హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు. రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమైన నీతివంతమైన రాజకీయాన్ని పాటించి,95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 8వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు.

నవంబర్ 7.. ఆచార్య ఎన్జీ రంగా జయంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు...
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

క్లీన్ అండ్ గ్రీన్ దీపావళి



దీపావళి సమీపిస్తున్న సమయంలో మనం అందరం క్లీన్ అండ్ గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా ఇటీవల ప్రపంచంలోనే అత్యంత వాయి కాలుష్య నగరాలు పట్టిక నివేదిక చూస్తే ఆందోళన కలిగిస్తోంది.. మొదటి పది అత్యంత వాయు కాలుష్య నగరాల్లో తొమ్మిది నగరాలు మనదేశంలోనే ఉండుట గమనించదగిన విషయం.. మీరట్, ఘజియాబాద్, న్యూఢిల్లీ, నోయిడా, థానే, పానిపట్, ఫరీద్ కోట్, భటిండా, లూథియానా, ముజఫర్ నగర్, రోహ్ తక్ వంటి పలు నగరాలు సుమారు 300-400 మధ్య ఏ.క్యూ.ఐ వాయుకాలుష్యంతో నిలిచాయి. ఒక పక్క పరిశ్రమల కాలుష్యం, మరోవైపు స్టబ్బింగ్ (పంట వ్యర్థాలు) కాల్చివేతతో దాదాపు ఉత్తర భారతదేశంలో పలు నగరాలు విపరీతమైన వాయి కాలుష్యంతో అధ్వాన్నంగా, అనారోగ్యం కలిగించే కేంద్రాలుగా మారుతున్నాయి. శీతాకాలం సమీపిస్తున్న వేళ కాలుష్యం మరింత పెరిగింది... ఇదే సమయంలో దీపావళి సందర్భంగా విపరీతమైన వాయి కాలుష్యం వెదజల్లే బాణాసంచా కాలిస్తే ఇక ఈ నగరాలు 400-500 ఏ.క్యూ.ఐ చేరి అత్యంత ప్రమాదకరమైన నగరాలుగా మారతాయి.. దీంతో పిల్లలు, ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్న వారు, హృద్రోగులు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.దాదాపు ప్రజలు అందరూ అనారోగ్యం పాలై పరిస్థితి ఏర్పడుతుంది . మన దేశంలో చాలా పట్టణాలు, నగరాలు ఏ.క్యూ.ఐ 50 పరి మితి లోపులేవు అంటే అతిశ యోక్తి కాదు. అనగా ఆరోగ్యకర మైన, కాలుష్య రహిత నగరాలు లేవు.



ఇటువంటి పరిస్థితుల్లో అనేక వేల రూపాయలు ఖర్చు చేసి బాణాసంచా కాల్చడం ఆరోగ్యకరం కాదని గ్రహించాలి.. ప్రతీ ఒక్కరూ ఆనందంగా, ఆహ్లాదంగా పొదుపుగా దీపావళి జరుపు కోవడానికి ప్రయత్నం చేయాలి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగి దాదాపు ప్రతీ ఒక్కరూ బ్రతకడానికి ఇబ్బంది పడుతున్న ప్రస్తుత తరుణంలో, అధిక మొత్తంలో బాణాసంచా కొని కాల్చడం ఆర్థికంగా, ఆరోగ్య పరంగా మంచిది కాదు అని గ్రహించాలి.. దేశంలోనూ, మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా 'ఎలినినో' ప్రభావం వలన కరువు తాండవిస్తోంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం వలన ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవితాలు దుర్భరంగా మారాయి.. పేదరికం పొంచివుంది..భవిష్యత్తు అంధకారంగా కనపడుతుంది.. ఏదీ కొనేటట్లు, ఏమీ తినేటట్లు కనపడటం లేదు.బియ్యం ధరలు హడలెత్తిస్తున్నాయి. మరియు 'అర్నాబ్', 'మురసు' తుఫాన్ వలన ఆంధ్రప్రదేశ్‌లో చాలా జిల్లాల ప్రజలు, రైతులు నష్టపోయారు. తెలంగాణాలో ఎలినినో ప్రభావం అధికంగా కనపడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో మరింత పొదుపు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీపావళి అంటే దీపాలు వెలిగించి, నూతన వస్త్రాలు ధరించి బంధుమిత్రులతో కలిసి ఆనందంగా ఉత్సాహంగా సరదాగా, ఇంటిలో తయారు చేసిన రుచికరమైన వంటకాలు భుజించి, తగు మాత్రంగా స్వదేశీ బాణాసంచా కాల్చడం అని గ్రహించాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు స్వస్తి పలకాలి. దేశీయ రంగులు వాడాలి. సాంప్రదాయ బద్ధమైన ప్రమిదలు వాడాలి. ఎకో ఫ్రెండ్లీ గా జరుపుకోవాలి. వాయు ధ్వని రహితంగా క్లీన్ అండ్ గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి అందరూ ప్రయత్నం చేయాలి .అందరం స్వచ్ఛ భారత్ సాధనకు కృషి చేద్దాం. కాలుష్య రహిత సమాజం నిర్మిద్దాం.

ఆరోగ్య భారత్ సాధిద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. అనవసర ఖర్చులు తగ్గిద్దాం. విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాలి. ఇదే మన అందరి జీవితాలలో నిజమైన వెలుగులు నింపే క్లిన్ అండ్ గ్రీన్ దీపావళి అని భావిద్దాం..

- ఐ.ప్రసాదరావు
9390509791

భారత విప్లవాత్మక జాతీయవాది బిపిన్



భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో స్వదేశీ ఉద్యమానికి, ఉగ్ర జాతీయ వాదానికి ఊపిరిలూదిన త్రిమూర్తులలో 'లాల్- బాల్- పాల్' త్రయం అత్యంత కీలకమైనది. ఆ త్రయంలో 'పాల్'గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పత్రికా సంపాదకుడు, గొప్ప వక్త మరియు సామాజిక సంస్కర్త బిపిన్ చంద్రపాల్. ప్రతి సంవత్సరం నవంబర్ 7న ఆయన జయంతిని పురస్కరించుకుని భారతజాతి ఆయన అందించిన మహోన్నత సేవలను స్మరించుకుంటుంది. బ్రిటీష్ పాలకుల గుండెల్లో సింహస్వప్నమై నిలిచి, భారతీయ ప్రజలలో స్వరాజ్య కాంక్షను రగిల్చిన మహనీయులలో బిపిన్ చంద్రపాల్ అగ్రగణ్యులు.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉగ్ర జాతీయవాద పితామహుడిగా ప్రసిద్ధి చెందిన బిపిన్ చంద్రపాల్ 1858 నవంబర్ 7న అవిభక్త బెంగాల్‌లోని సిల్హెట్ (ప్రస్తుతం బంగ్లాదేశ్లో ఉంది) జిల్లాకు చెందిన 'పోయిల్' అనే గ్రామంలో ఒక సంపన్న, సాంప్రదాయక కాయస్థ జమీందారీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి రామచంద్రపాల్ పర్షియన్ భాషలో మంచి ప్రావీణ్యం ఉన్న న్యాయవాది కాగా, తల్లి నారాయణి దేవి గృహిణి. తండ్రి ప్రేరణతో చిన్నతనంలోనే సంస్కృతం, పర్షియన్ భాషలతో పాటు బెంగాలీ సాహిత్యంలో ఆయనకు మంచి పట్టు లభించింది. ప్రాథమిక విద్యను స్థానిక బడిలోనే పూర్తి చేసిన బిపిన్ చంద్రపాల్, ఉన్నత విద్య కోసం కలకత్తాలోని ప్రఖ్యాత ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు.

అయితే అక్కడ చదువుకుంటున్న సమయంలోనే బ్రహ్మసమాజ సిద్ధాంతాలకు ఆకర్షితులై, కేశవచంద్ర సేన్, శివనాథ శాస్త్రి వంటి మహనీయుల ప్రభావంతో ఆ సంస్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. సాంప్రదాయ కుటుంబ నియమాలను ధిక్కరిస్తూ సంస్కరణల వైపు మొగ్గు చూపడం వల్ల తండ్రితో విభేదాలు వచ్చి కాలేజీ చదువును పూర్తి చేయలేకపోయినప్పటికీ, స్వయంకృషితో ఇంగ్లీష్, బెంగాలీ భాషల్లో అపారమైన విజ్ఞానాన్ని ఆర్జించి ఉపాధ్యాయుడిగా, పత్రికా సంపాదకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1905 నాటి బెంగాల్ విభజన కాలంలో బిపిన్ చంద్రపాల్ ప్రారంభించిన పత్రికలు, చేసిన ఉపన్యాసాలు స్వదేశీ ఉద్యమానికి బలమైన పునాదిని వేశాయి. బ్రిటీష్ వస్తువులను బహిష్కరించడం మాత్రమే కాకుండా, స్వదేశీ ఉత్పత్తుల తయారీ, స్వదేశీ విద్యాసంస్థల స్థాపన ద్వారా భారతదేశం ఆర్థికంగా, సామాజికంగా ఆత్మనిర్భరత సాధించాలని ఆయన పిలుపు నిచ్చారు. రాజ్యాంగబద్ధమైన వినతుల ద్వారా స్వరాజ్యం రాదని, అది ప్రజల నిరసనలు, ఉద్యమాలు మరియు ఆత్మపరిశీలన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని నమ్మి, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయి పోరాటాన్ని నడిపించారు.

బిపిన్ చంద్రపాల్ కేవలం ఉపన్యాసకుడు మాత్రమే గాక, అద్భుతమైన పత్రికా సంపాదకుడు. 'పరిదర్శక్', 'న్యూ ఇండియా', 'వందే మాతరం','స్వరాజ్' వంటి పత్రికల ద్వారా ప్రజలలో జాతీయభావాన్ని నూరిపోశారు. ఆయన రాసిన వ్యాసాలు యువతలో దేశభక్తిని మరియు విప్లవ భావాలను రగిలించాయి. అరవిందో ఘోష్ వంటి ప్రముఖ నాయకులతో కలిసి ఆయన నడిపిన విప్లవాత్మక జాతీయవాదం, నాటి బ్రిటీష్ పాలకులకు నిద్రలేకుండా చేసింది. పత్రికా స్వేచ్ఛ కోసం, భావప్రకటనా స్వేచ్ఛ కోసం ఆయన నిరంతరం పోరాడారు. పబ్లిక్ ఒపీనియన్, ది ట్రిబ్యూన్, న్యూ ఇండియా పత్రికలకు పాల్ విలేఖరిగా పనిచేశాడు. తను పాత్రికేయుడిగా పనిచేస్తున్న కాలంలో జాతీయవాదాన్ని ప్రచారం చేశాడు. చైనా రాజకీయాల్లో జరుగుతున్న పెనుమార్పులు అలాగే ప్రపంచవ్యాప్తంగా భౌగోళికంగా రాజకీయంగా ఉన్న పరిస్థితుల గురించి భారత ప్రజానీకాన్ని చైతన్య పరుస్తూ ఆయన అనేక వ్యాసాలు ప్రచురించాడు. పాల్ తన రచనలలో భారత దేశ భవిష్యత్తుకు ఎటువంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయో వివరిస్తూ ఒక ప్రత్యేక వ్యాసాన్ని రాశాడు. బిపిన్ చంద్రపాల్ జీవితంలోనూ, రాజకీయంలోనూ ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేక అనుబంధం ఉంది. 1907లో ఆయన రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్నం, విజయవాడ మరియు గుంటూరు ప్రాంతాలలో పర్యటించి చేసిన 'వందేమాతరం' ఉపన్యాసాలు ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమానికి నూతన ఉత్తేజాన్ని



ఇచ్చాయి. ఆయన ఉపన్యాసాల ప్రభావంతో కోస్తా ఆంధ్రలో విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ కళాశాలల స్థాపన వేగవంతమయ్యాయి. ఆంధ్ర యువతలో స్వరాజ్య కాంక్షను రగల్చడంలో ఆయన పర్యటన చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు సామాజిక సమానత్వం సాధించడమే నిజమైన స్వరాజ్యమని బిపిన్ చంద్రపాల్ విశ్వసించారు. బ్రహ్మసమాజ్ ప్రభావంతో ఆయన మూఢనమ్మకాలు, కుల వివక్ష మరియు వితంతువుల పట్ల చూపే దురాచారాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. స్వయంగా వితంతువును వివాహం చేసుకుని ఆచరణాత్మక సంస్కర్తగా నిలిచారు. మహిళల విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు శ్రామికవర్గం యొక్క హక్కుల కోసం ఆయన చేసిన కృషి ఆయనలోని మానవతా దృక్పథానికి నిదర్శనం. బిపిన్ చంద్రపాల్ ఆలోచనలు కేవలం ఆనాటి స్వాతంత్ర్య పోరాటానికి మాత్రమే పరిమితం కాక, నేటి స్వతంత్ర భారతదేశ స్వదేశీ విధానాలకు, ఆత్మనిర్భరత ఆలోచనలకు సైతం దిశానిర్దేశం చేస్తున్నాయి. 'స్వదేశీ, స్వరాజ్యం, జాతీయ విద్య' అనే త్రిసూత్రాల ద్వారా ఆయన అందించిన జాతీయవాదం అమరమైనది. బిపిన్ చంద్రపాల్ జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను, సిద్ధాంతాలను స్మరించుకుంటూ, నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

- సుధాకర్ . ఏ. వి
9000674747

జనంలో... పొన్నం

బైక్ పై మార్కెట్‌కు ... కాలినడకన ఎల్లమ్మ చెరువు వరకు
ప్రజలతో మమేకమైన మంత్రి పొన్నం
హుస్నాబాద్ పట్టణంలో విస్తృతంగా పర్యటన
కార్యకర్తలతో కలిసి పాదయాత్ర
వ్యాపారులు, రైతులు, మహిళలు, స్థానిక ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్న మంత్రి

ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనుల పరిశీలన, పలు సూచనలు





చిగురు మామిడి నవంబర్ 6 (మనం న్యూస్): హుస్నాబాద్ పట్టణంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని మార్కెట్ వరకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన మంత్రి, అక్కడి నుంచి పార్టీ కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తూ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ భవనాన్ని పరిశీలించారు. ప్రెస్ క్లబ్ భవన ఆధునీకరణకు సంబంధించి స్థానిక జర్నలిస్టులు మంత్రితో చర్చించారు. వారి సూచనలు, అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మార్కెట్లో కూరగాయలు విక్రయించే మహిళలు, వ్యాపారులు, రైతులు, స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిలో పలు సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు.

అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం మీదుగా ఎల్లమ్మ చెరువు వరకు పాదయాత్రగా వెళ్లి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే చెరువు మరింత ఆహ్లాదకరమైన వాతావరణంతో రూపుదిద్దుకుని పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మారుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

హుస్నాబాద్‌కు గౌరవెల్లి వరం

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు**
- **పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు**
- **ఇందిరమ్మ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ, రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా**
- **బీసీ, రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**



చిగురుమామిడి, నవంబర్ 6 (మనం న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2007లో ప్రారంభమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరు చేసుకున్నామని, సుప్రీంకోర్టులో ఉన్న కేసును క్లియర్ చేసుకున్నామని చెప్పారు. గౌరవెల్లి కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని, భూ నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తున్నామని వెల్లడించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులకు సంబంధించిన వాస్తవాలను ప్రజలు గమనించాలని, కాలువల ద్వారా గ్రామాలకు సాగునీరు అందించే ప్రక్రియలో రైతులు సహకరించాలని కోరారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను కవల ప్రాజెక్టులుగా పూర్తి చేస్తామని, గండిపల్లి ద్వారా 14 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఎల్కతుర్తి ప్రాంతానికి ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా, భీమదేవరపల్లి ప్రాంతానికి దేవాదుల ద్వారా, హుస్నాబాద్ ప్రాంతానికి గౌరవెల్లి ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్ మానేరు ఫేజ్-3 ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత పదేళ్లలో గ్రామాలకు ఎన్ని ఇళ్లు వచ్చాయో ప్రజలు ప్రశ్నించాలని మంత్రి సూచించారు. గత ఏడాది హుస్నాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ప్రస్తుతం మరో 2,000 ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి బూత్కు 8 ఇళ్లు, ప్రతి 200 ఓట్లకు ఒక ఇందిరమ్మ ఇల్లు కేటాయించే విధంగా పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వారి సొంత ఇళ్లలో జరుపుకోవాలని పార్టీ ప్రతినిధులు, అధికారులు, నాయకులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయి, అర్హత ఉన్నప్పటికీ ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. కొత్తపల్లి రోడ్డు విస్తరణలో, అక్కన్నపేట వైపు రోడ్డు అభివృద్ధిలో ఇళ్లు కోల్పోయిన వారికి, పారిశ్రామిక కారిడార్లో భూములు కోల్పోయిన వారికి కూడా అర్హత మేరకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. చిలకపచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామని, అదే సభా వేదికపై ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. హుస్నాబాద్, కోహెడ ప్రాంతాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 136 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీపావళి మరుసటి రోజు నుంచి ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. జనవరిలో నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని, అనంతరం రైతు మేళా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి మండలాల వారీగా ఉపకరణాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. హుస్నాబాద్లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 290 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని, కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేశామని తెలిపారు. హుస్నాబాద్లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మోడల్ స్కూల్, డిగ్రీ కళాశాల మధ్య చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేస్తామని, బస్తీ దవాఖాన నిర్మాణానికి పునాది వేసుకున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఎల్కతుర్తికి కోర్టు మంజూరైందని, భీమదేవరపల్లికి విజ్ఞాన కేంద్రం మంజూరైందని వెల్లడించారు. చిగురుమామిడిలో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు కానుందని, నియోజకవర్గానికి ఎమ్మార్వో కార్యాలయాలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. ఎల్లమ్మ చెరువు వైపు నాలుగు లైన్ల రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, కరీంనగర్ కొత్తపల్లి వైపు నాలుగు లైన్ల రోడ్డు పనులను వేగవంతం చేశామని చెప్పారు.

హుస్నాబాద్ ప్రాంతంలో అర్బన్ ఫారెస్ట్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్క్ తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కోహెడ చెరువు నుంచి డంప్ యార్డును తొలగించామని, చెరువును పర్యాటక ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ రాతి గర్భగుడి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం, పొట్లపల్లి శ్రీ రాజేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. హుస్నాబాద్ స్పోర్ట్స్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి గ్రామంలో కబడ్డీ, వాలీబాల్, కోకో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రతి గ్రామానికి రూ.లక్ష చొప్పున విడుదల చేస్తామని ప్రకటించారు. గ్రామాల్లో బతుకమ్మ ఘాట్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పొలాలకు వెళ్లేందుకు దారులు అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఉపాధి హామీ పథకం కింద పొలాలకు వెళ్లే దారుల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి పేద కుటుంబం సొంత ఇందిరమ్మ ఇంట్లో ఆనందంగా దీపావళి జరుపుకోవాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఈ నెల 8న దీపావళి వేడుకలు

- **పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
- **కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
- **అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

సిరిసిల్ల, నవంబర్ 6 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన జిల్లాలోని పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం ఎంపీడీవోలు, హౌసింగ్, జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల ముందు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' లోగో స్టిక్కర్ను అతికించి, లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఎదుట దీపాలు వెలిగించి, ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ద్వారా ఫొటోలు తీసి సోషల్ మీడియా ఖాతాల్లో అప్లోడ్ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై లబ్ధిదారుల ఫొటోలను నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత ఉన్న పరిస్థితులను తెలియజేసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను గుర్తించి లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, హౌసింగ్ శాఖ అధికారులు, ఇందిరమ్మ గృహ నిర్మాణ కమిటీ సభ్యులు సమన్వయంతో పూర్తయిన ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. అధికారులు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఇన్చార్జి హౌసింగ్ పీడీ సాజిద్ పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవతో దత్తత వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం

జగిత్యాల, నవంబర్ 6(మనం న్యూస్): చిన్నారుల సంక్షేమం, వారి భవిష్యత్తు భద్రత, చట్టపరమైన హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తతకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో, మానవతా దృక్పథంతో, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. చిన్నారి భవిష్యత్తును ప్రభావితం చేసే సున్నితమైన అంశం కావడంతో ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిగణించారు. దత్తతకు సంబంధించిన వివాదం కొనసాగడం వల్ల చిన్నారి సంక్షేమం, కుటుంబ వాతావరణం, భవిష్యత్తు భద్రతపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. చిన్నారి ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యత దత్తతకు సంబంధించిన అంశాల్లో కేవలం సాంకేతిక, పరిపాలనాపరమైన విషయాలకే పరిమితం కాకుండా, చిన్నారి శ్రేయస్సు, మానసిక ప్రశాంతత, కుటుంబ భద్రత, విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ భావించారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, దత్తత వివాదానికి చట్టబద్ధమైన పరిష్కారం లభించే విధంగా చర్యలు చేపట్టారు. చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం (హిందూ అడాప్షన్ అండ్ యాక్ట్- హెచ్.ఎం.ఏ) 1956 ప్రకారం దత్తత ప్రక్రియను చట్టబద్ధంగా స్థానిక జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో పూర్తి చేశారు. సంబంధిత బాలల సంక్షేమ అధికారుల సమక్షంలో దత్తతకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా చిన్నారి భవిష్యత్తుకు చట్టపరమైన భరోసా కల్పించే దిశగా ముఖ్యమైన ముందడుగు పడింది. దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనల అమలు, చిన్నారి ప్రయోజనాల పరిరక్షణ, సంబంధిత కుటుంబాల మధ్య సామరస్యపూర్వక పరిష్కారం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు.



వివాదానికి శాంతియుత పరిష్కారం

గతంలో వివాదాస్పదంగా మారిన ఈ దత్తత వ్యవహారం జిల్లా కలెక్టర్ చొరవతో శాంతియుతంగా పరిష్కారమైంది. చిన్నారి ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని, సంబంధిత వర్గాల మధ్య నెలకొన్న వివాదానికి పరిష్కారం లభించేలా జిల్లా యంత్రాంగం వ్యవహరించింది. ఈ పరిణామంతో చిన్నారి కుటుంబ వాతావరణంలో భద్రంగా పెరిగేందుకు, విద్యాభ్యాసం కొనసాగించేందుకు, భవిష్యత్తులో చట్టపరమైన హక్కులను పొందేందుకు మార్గం సుగమమైంది.

రిట్ అప్పీల్ ఉపసంహరణకు నిర్ణయం

దత్తతకు సంబంధించిన సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో, ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో దాఖలు చేసిన రిట్ అప్పీల్ను ఉపసంహరించుకోవాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. చిన్నారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని కొనసాగించకుండా, చట్టబద్ధమైన పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. మానవతా దృక్పథంతో కూడిన పరిపాలనకు నిదర్శనం ప్రభుత్వ పరిపాలనలో చట్టబద్ధతతో పాటు మానవతా విలువలకు కూడా సముచిత ప్రాధాన్యత ఉండాలనే విషయాన్ని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన సున్నితమైన సమస్యలను పరిష్కరించే సందర్భంలో వారి భవిష్యత్తు, భద్రత, సంక్షేమం అన్నింటికంటే ముఖ్యమని ఈ వ్యవహారం స్పష్టం చేస్తోంది. చిన్నారి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ, చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ తీసుకున్న ప్రత్యేక చొరవ పట్ల పెంపుడు తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించి, చిన్నారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేసిన జిల్లా కలెక్టర్ చర్యలను పలువురు అభినందించారు.

ఆదర్శ్ రెడ్డి చొరవతో నిలిచిన గుడిసెల



- **తొలగింపు చర్యలు**
- **పేదల గుడిసెల తొలగింపునకు 45 రోజుల గడువు**
- **ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించే వరకు ఇబ్బందులు పెట్టొద్దని విజ్ఞప్తి**

రామచంద్రాపురం, నవంబర్ 7 (మనం న్యూస్) : శేరిలింగంపల్లి ఓల్ ఎంఐజి ప్రాంతంలో సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాల గుడిసెల తొలగింపు చర్యలు తాత్కాలికంగా నిలిచాయి. రైల్వే పోలీసులు, అధికారులు గుడిసెల తొలగింపునకు వచ్చిన విషయం తెలుసుకున్న పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. తొలగింపు చర్యలను నిలిపివేసి, వారి సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించాలని అధికారులను కోరారు. దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించకుండా గుడిసెలను తొలగిస్తే వారు నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆదర్శ్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రైల్వే అధికారుల సమక్షంలోనే స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించే దిశగా చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నివాసితులకు ఇబ్బందులు కలగకుండా కనీసం 45 రోజుల గడువు ఇవ్వాలని ఆదర్శ్ రెడ్డి రైల్వే అధికారులను కోరారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన రైల్వే సిబ్బంది 45 రోజుల వరకు వేచి ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబాలకు తాత్కాలిక ఊరట లభించింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, గిరి, నర్సింహ, సంపత్ గౌడ్, చిన్న, తిలావత్, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు.. అప్రమత్తంగా ఉండాలి



- **మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు ఆహ్వానించినట్లే**
- **ప్రజలకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరిక**

సిరిసిల్ల, నవంబర్ 06 (మనం ప్రతినిధి): మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాలతో చెలగాటమాడటమేనని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల వాహనం నడిపే వ్యక్తి ప్రాణాలకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాల్లో జీవితాంతం తీరని విషాదాన్ని నింపుతుందని పేర్కొన్నారు. మద్యం సేవించిన సమయంలో వాహనంపై నియంత్రణ తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రతి వాహనదారుడు రహదారి భద్రతను బాధ్యతగా భావించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని, ప్రయాణం అవసరమైతే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా వ్యవహరించవద్దని, బాధ్యతాయుతమైన డ్రైవింగ్తో రోడ్డు ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. మన కుటుంబంతో పాటు రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి కుటుంబంలోనూ ఆనందం నిలవాలంటే రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. మద్యం తాగితే డ్రైవింగ్ వద్దు.. సురక్షిత ప్రయాణమే మన లక్ష్యం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల తరఫున విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- **అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ను కలిసిన కాంగ్రెస్ నాయకులు**
- **సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యలను వివరించిన కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి**



అమీన్పూర్, నవంబర్ 7 (మనం న్యూస్) : అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కుమారి లలిత శ్రావణిని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలు, ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను శశిధర్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, మెంబర్ లక్ష్మీకాంత్ రావు, అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దండు రమేష్ యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు ముదిరాజ్, మహేష్ గౌడ్, శ్రీనివాస్, ప్రకాష్, మనోహర్, రామ్ చంద్ర రెడ్డి, కృష్ణ యాదవ్, రాము, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

నీటి ఎత్తిపోతల కు 100 కోట్లు కేటాయిస్తే కరువును ఎదుర్కోవచ్చు.
బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి


జగిత్యాల నవంబర్ 06(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్లో మాజీ మంత్రి బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా, సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి జలాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కరువు సమయంలో తాగు, సాగునీరు అందించాలన్నది కేసీఆర్ దూరదృష్టి, మూడేళ్లలో పూర్తయిన కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులకు మూడేళ్లుగా అడుగు ముందుకు పడటం లేదన్నారు. కన్నెపల్లి పంప్హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మిస్తే 20 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయవచ్చు, నీటి ఎత్తిపోతలకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రాన్ని కరువు నుంచి గట్టెక్కించ వచ్చన్నారు. డ్రిప్ సౌకర్యానికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి.. ఉద్యానవన శాఖ వద్ద బడ్జెట్ లేదనడం సరికాదన్నారు. రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఫేక్ మెసేజ్లు కాకుండా రాయితీపై విత్తనాలు అందించాలన్నారు. కేసీఆర్కు పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి వినియోగాన్ని అడ్డుకుంటోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదికను ముఖ్యమంత్రి చదవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి నాయకుడు గాజుల రాజేందర్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు. నెల రోజుల్లో కాఫర్ డ్యాం నిర్మించి, నెలకు 30 టీఎంసీల చొప్పున ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావచ్చు అన్నారు. మేడిగడ్డ మరమ్మతులకు కన్నెపల్లి వద్ద కాఫర్ డ్యాం నిర్మాణం అడ్డంకి కాదని కేంద్ర సంస్థ నివేదిక అందించింది అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు ఒక విధానం.. కన్నెపల్లి పంప్హౌస్కు మరో విధానమా? ప్రభుత్వ తీరుపై ఆయన ప్రశ్నించారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.30 వేల రాయితీ కల్పించాలి అని డిమాండ్ చేశారు.



మనం Manam

Medak మెదక్

ఐటీఎల్ ఎండీని విందుకు ఆహ్వానించిన మోదీ



హైదరాబాద్, నవంబర్ 6(మనంన్యూస్): తమ సాహసోపేతమైన ఆశయాలను అంతర్జాతీయ విజయాలుగా మలిచే ధైర్యం గల దార్శనికులే ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన సంస్థలను నిర్మించారు. భారతదేశపు ఇంజనీరింగ్ నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తిగా రూపాంతరం చెందడానికి ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ (ఐటీఎల్) నేడు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ మిట్టల్ మాట్లాడుతూ, 'అంతర్జాతీయ వేదికపై భారతదేశం యొక్క పెరుగుతున్న భాగస్వామ్యాన్ని, స్థాయిని ప్రతిబింబించే ఒక కార్యక్రమంలో భాగం కావడం ఒక గొప్ప గౌరవం. లీచ్టెన్స్టైన్ యువరాజు, హెచ్.ఎస్.హెచ్. హెరిడిటరీ ప్రిన్స్ అలోయిస్ను సత్కరించే ఈ విందుకు ఆహ్వానించినందుకు గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీకి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.' అని అన్నారు. 2026లో కంపెనీ తన మూడు దశాబ్దాల ఘన ప్రస్థానాన్ని జరుపుకుంటున్న తరుణంలో, ఐటీఎల్ జాతీయ ప్రతిష్టకు సంబంధించిన ఒక విశిష్ట ఘట్టాన్ని నమోదు చేసింది. ఐటీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ మిట్టల్ ఇటీవల, లీచ్టెన్స్టైన్ యువరాజు, హెచ్.ఎస్.హెచ్. హెరిడిటరీ ప్రిన్స్ అలోయిస్ను సత్కరించే ప్రత్యేక విందుకు గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ నుండి ప్రతిష్ఠాత్మకమైన ఆహ్వానాన్ని అందుకున్నారు. ఈ విందు 2026 అక్టోబర్ 27న న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్లో జరగనుంది. ఈ కార్యక్రమం ఈఎఫ్టీఏ వాణిజ్య మరియు ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కింద ద్వైపాక్షిక, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్: ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, నవంబర్ 6(మనం న్యూస్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో నమోదైన వరుస దారి దోపిడీ కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి, జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి ఎన్ హెచ్-65 పై జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి మహారాష్ట్రకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

ఛేదించిన దారిదోపిడి నేరాల వివరాలు ఇలా ఉన్నాయి. చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ - క్రైమ్ నంబర్ 108/2026, సెక్షన్ 309(4) ఆర్/డబ్ల్యు 3(5) బిఎన్ఎస్: తేదీ 17.10.2026 రాత్రి సుమారు 11:10 గంటల సమయంలో చిరాగ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ హెచ్ -65 జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కారులోని వ్యక్తులను నిందితులు నకిలీ తుపాకీ, కత్తులతో బెదిరించి రెండు బంగారు గాజులు, బంగారు పుస్తెల తాడు, బంగారు మరియు డైమండ్ నెక్లెస్, ఉంగరం, రూ.2,500 నగదును దోచుకున్నారు. సదాశివపేట పోలీస్ స్టేషన్ - క్రైమ్ నంబర్ 580/2026, సెక్షన్ 309(4) బి.ఎన్.ఎస్: తేదీ 25.10.2026 అర్ధరాత్రి సుమారు 2:00 గంటల సమయంలో సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ హెచ్-65 జాతీయ రహదారిపై ఆరూరు గ్రామ శివారులో నిలిపి ఉంచిన కారులోని వ్యక్తులను బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును దోచుకున్నారు. కోహీర్ పోలీస్ స్టేషన్ - క్రైమ్ నంబర్ 173/2026, సెక్షన్ 309(4) ఆర్/డబ్ల్యు 3(5) బి.ఎన్.ఎస్ : తేదీ 25.10.2026 అర్ధరాత్రి అందాజ 3:20గంటల సమయంలో మరో కారును లక్ష్యంగా చేసుకొని అందులోని వ్యక్తులను ఆయుధాలతో బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును దోచుకొని పారిపోయారు. కర్ణాటక రాష్ట్రం: . హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ - బీదర్ జిల్లా, కర్ణాటక రాష్ట్రం: తేదీ 22/23.10.2026 అర్ధరాత్రి హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇదే తరహాలో దారి దోపిడీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.

నేరాలకు పాల్పడిన విధానం:

మహారాష్ట్ర రాష్ట్రంలోని లాతూర్, పూణే, బారామతి ప్రాంతాలకు చెందిన నిందితులు ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో జాతీయ రహదారులపై వెళుతూ, అత్యవసరాలకై రోడ్డు పక్కన ఒంటరిగా నిలిపి ఉంచిన కార్లను లక్ష్యంగా చేసుకొని, తమ ద్విచక్ర వాహనాన్ని కొంత దూరంలో నిలిపి, ముఖాలు గుర్తుపట్టకుండా మంకీ క్యాప్లు ధరించి కార్ల వద్దకు వెళ్లేవారు. తమ వెంట తెచ్చుకున్న నకిలీ తుపాకీ, కత్తులతో కార్లలో ఉన్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును బలవంతంగా దోచుకునేవారు. అనంతరం ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి పారిపోయి, దోచుకున్న బంగారు ఆభరణాలను తమకు పరిచయమున్న వ్యక్తి ద్వారా లాతూర్లోని బంగారు దుకాణంలో విక్రయించి, వచ్చిన డబ్బులను పంచుకునేవారు.

నిందితుల అరెస్ట్:

నిందితులు మరోసారి తెలంగాణ రాష్ట్రంలో దారి దోపిడీలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో భాగంగా ముగ్గురు నేరస్తులు నేరం చేయడానికై మహారాష్ట్ర నుంచి యమహా బ్ల్యూ కలర్ నెంబర్ ప్లేట్ లేని బైక్ పై బయలుదేరి నల్లని మాస్క్, స్వెట్టర్ లు, 2-కత్తులు బ్యాగ్ లో పెట్టుకొని, మరో వ్యక్తి ఎయిర్ పిస్టల్ ను కనబడకుండా దాచి పెట్టుకొని, తెలంగాణ వైపు వస్తుండగా, చిరాగ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్గి చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని యమహా బ్ల్యూ కలర్ ఆర్ 15 బైక్ పై అనుమానాస్పదంగా కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, సంగారెడ్డి జిల్లాలో జరిగిన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్లో జరిగిన మరో దారి దోపిడీ కేసులో తమ ప్రమేయాన్ని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాలను నిలిపి ఉంచరాదు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలను నిలిపి ఉంచాల్సి వస్తే పెట్రోల్ బంకులు, ధాబాలు, హోటళ్లు వంటి జనసంచారం ఉండే సురక్షిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలి.

వాహనాలు బ్రేక్డౌన్, టైర్ పంక్చర్ లేదా ఇతర అత్యవసర సహాయం అవసరమైనప్పుడు వెంటనే డయల్ 112 లేదా జాతీయ రహదారి పెట్రోలింగ్ టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలి. వీలైనంత వరకు జనసంచారం ఉన్న, వెలుతురు ఉండే సురక్షిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపి ఉంచాలి. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

భూసర్వేను పరిశీలించిన ఆర్డీవో



ములుగు, నవంబర్ 6(మనంన్యూస్): గంగాధర్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ సర్వేను గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రామ రైతులతో నేరుగా మాట్లాడి, వారి భూ సమస్యలు, భూముల హద్దులు, సర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకొని, భూ సర్వే ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించి, సర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని ప్రతి రైతు భూ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, అధికారులకు సహకరించాలని గ్రామ సర్పంచ్ పూరెల్లి శ్రీకాంత్ రెడ్డి కోరారు. రీ-సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఎకరా భూమిని గుర్తించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు తమకు సంబంధించిన భూ పత్రాలు సిద్ధంగా ఉంచుకుని సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలు పారదర్శకంగా నమోదు చేయబడతాయని, భవిష్యత్తులో భూములకు సంబంధించిన సమస్యలు తగ్గుముఖం పడతాయన్నారు. ఆమె వెంట ములుగు మండల తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఉపసర్పంచ్, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు సహకరించాలి

- సకాలంలో సీఎంఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి
- నిబంధనలు పాటించని మిల్లులపై కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్



సిద్దిపేట నవంబర్ 6 (మనం ప్రతినిధి): జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రైస్ మిల్లర్లు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. లక్ష్మి కిరణ్ సూచించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం స్వీకరణ, మిల్లింగ్ మరియు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా జిల్లా మేనేజర్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో ఒప్పందం చేసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని తెలిపారు. ఒప్పందం చేసుకొని, చెల్లుబాటు అయ్యే ఈ బ్యాంకు సమర్పించని మిల్లులకు ధాన్యం కేటాయింపు చేయబడదని స్పష్టం చేశారు. మిల్లర్లు తమ మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసుకునేందుకు అవసరమైన హమాలీలు, నిల్వ స్థలం, మిల్లింగ్ యంత్రాలు మరియు ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా దిగుమతి చేసుకొని, సకాలంలో మిల్లింగ్ పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని డెలివరీ చేయాలని తెలిపారు. అలాగే, ధాన్యం స్వీకరణ, మిల్లింగ్ మరియు సీఎంఆర్ డెలివరీకి సంబంధించిన అన్ని వివరాలను ఓ పి ఎం ఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ప్రభుత్వ ధాన్యం మరియు ప్రైవేటు ధాన్యాన్ని వేర్వేరుగా నిల్వ చేయాలని సూచించారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అవసరమైన రికార్డులతో పాటు ఎ1, ఎ2,ఎ3 రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించి, స్టాక్ వివరాలను అందుబాటులో ఉంచి తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలని తెలిపారు.

ధాన్యం కొరత, అక్రమ తరలింపు, సీఎంఆర్ డెలివరీలో జాప్యం లేదా ప్రభుత్వ మార్గదర్శకాల ఉల్లంఘనలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు ధాన్యం రవాణా, దిగుమతి మరియు మిల్లింగ్ ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సి.హెచ్. బ్రహ్మారావు, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ ఎం. గోపీకృష్ణ, సహాయ పౌర సరఫరాల అధికారి ఎం. సాయి రవి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్ మరియు జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



- ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో దీపావళి వేడుకలు నిర్వహించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



సంగారెడ్డి, నవంబర్ 6 మనం న్యూస్ ప్రతినిధి: ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, వీబీ-జీ రామ్ జీ, చేయూత పింఛన్లు, భూసేకరణ, సివిల్ వర్క్స్ పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపుల మరమ్మతులు చేపట్టడంతో పాటు, పైప్లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని ఆదేశించారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, బోరుబావుల వద్ద సోక్పిట్లు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు.

వీబీ-జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. జలసిరి పనులను విస్తృతంగా చేపట్టడం ద్వారా నీటి సంరక్షణకు మరింత దోహదపడాలని సూచించారు. చేయూత పథకం కింద కొత్తగా అందిన పింఛన్ దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా, పారదర్శకంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులు ఈ దీపావళి పండుగను జరుపుకునేలా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

అలాగే, పీఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రభుత్వ అవసరాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్లో సంగారెడ్డి జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్, డీఆర్డీఏ శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన

- 'ఓటు చోరీ' పేరుతో కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది
- బీజేవైఎం నాయకుల ఆరోపణ



కామారెడ్డి, నవంబర్ 6 (మనం బ్యూరో): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రేణుక ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాధాన్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల బొగుడ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ., ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌పై బీజేవైఎం నాయకుల విమర్శలు

ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ, ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై తప్పుడు ప్రచారం చేస్తోందని నాయకులు ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటరు జాబితాలోని తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి ఎన్నికల నిబంధనల ప్రకారం సరిదిద్దడమేనని వివరించారు. ఈ ప్రక్రియతో ఓటరు జాబితాలో పారదర్శకత, కచ్చితత్వం పెరుగుతాయని పేర్కొన్నారు.

యువత ఓటరు నమోదుపై దృష్టి సారించాలి...

18 సంవత్సరాలు నిండిన యువత ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతంలో యువత చైతన్యవంతమైన పాత్ర పోషించాలని, ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల రాజు, యువమోర్చా ఐటీ సెల్ కో-కన్వీనర్ సచిన్, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, ప్రదీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ పై అఘాయిత్యం
కామాంధుడికి 15 ఏళ్ల జైలు

కామారెడ్డి, నవంబర్ 6 (మనం బ్యూరో): చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కామారెడ్డి ఫాస్టాక్ ప్రత్యేక న్యాయస్థానం (పోక్సో కోర్టు) 15 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. తాడ్వాయి పరిధిలో 2022 జూన్ 12న కూలిపని ముగించుకుని ఇంటికి వచ్చిన తండ్రికి తన తొమ్మిదేళ్ల కుమార్తె కడుపునొప్పితో ఏడుస్తూ కనిపించింది. ఆరా తీయగా.. స్థానికుడు మంగళి చిన్న గంగాధర్ (49) చాక్లెట్ ఆశచూపి ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టినట్లు చిన్నారి తెలిపింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో తాడ్వాయి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు పక్కా వైద్య నివేదికలు, సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి ముక్తిదా నిందితుడికి 15 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా ఖరారు చేశారు. చిన్నారుల రక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యమని, ఇలాంటి దారుణాలకు ఒడిగడితే చట్టం ముందు ఎంతటి వారైనా తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా పకడ్బందీ దర్యాప్తు చేసిన అప్పటి ఎస్హెచ్ఓ అంజనేయులు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, ప్రస్తుత ఎస్హెచ్ఓ నరేష్, డీఎస్పీ శ్రీనివాసరావు, న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించిన పీపీ లక్ష్మీ మనోజ్ఞ, కోర్టు లైజనింగ్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై విచారణకు ఆదేశం

- కార్మికుల పట్ల మార్యాదుగా ప్రవర్తించారన్న ఆరోపణ
- విచారణకు ఆదేశించిన మంత్రి ప్రభాకర్

సిద్దిపేట, నవంబర్ 6 (మనం ప్రతినిధి): సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కార్మికులతో వ్యవహరించిన తీరుపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారిని గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని పేర్కొన్నారు. సిద్దిపేట డీఎం అధికారి కుర్చీలో కూర్చొని ఉండగా, కార్మికులు కింద కూర్చొని మాట్లాడుతున్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన అంశంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఎండీతో మాట్లాడి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆదేశించారు. విచారణలో ఘటనకు బాధ్యులుగా తేలిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అధికారులు కార్మికుల పట్ల గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

హలో.. పోగొట్టుకున్న మీ ఫోన్ దొరికింది!

- నెల రోజులలో 10 లక్షల విలువ గల 56 చరవాణుల రికవరీ
- సి.పి. రష్మీ పెరుమాళ్



సిద్దిపేట నవంబర్ 6 (మనం ప్రతినిధి): ఫోన్ పోతే ఆశలు వదులుకునేది ఒకప్పుడు. ఇప్పుడు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పోగొట్టుకున్న ఫోన్లను వెతికి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ మరింత వేగవంతంగా కొనసాగుతుంది. గత నెల రోజులుగా పోగొట్టుకున్న 56 మందికి వారి ఫోన్లను గుర్తించి రికవరీ చేసి తిరిగి అప్పగించారు. జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రత్యేక చొరవ చూపడంతో ఈ ప్రక్రియ జిల్లాలో మరింత వేగవంతంగా కొనసాగుతుంది. పోగొట్టుకున్న తమ ఫోన్ లు తిరిగి చేతకందడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఈఐఆర్ పోర్టల్ను సమర్థవంతంగా వినియోగించి, గత నెల రోజులలో మొత్తం 56 చరవాణులను రికవరీ చేసి బాధితులకు శుక్రవారం అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రికవరీ చేసిన 56 చరవాణులను (సుమారు 10 లక్షల రూపాయల విలువ గల ఫోన్లను) నేరుగా బాధితులకు శుక్రవారం అప్పగించారు. సి.పి. రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ పోయిన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఫోన్లను తిరిగి పొందిన బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, సి.పి. రష్మీ పెరుమాళ్ మరియు పోలీసు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఏడాదిగా 726 ఫోన్లు రికవరీ...

ఈ సంవత్సరం ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 726 చరవాణులను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగింద ని సీఈఐఆర్ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని సి.పి. తెలిపారు. ఎవరికైనా ఎక్కడైనా చరవాణి దొరికితే, వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో అప్పగించాలని లేదా ఆ నంబర్కు ఫోన్ చేసి వారికి అందజేయాల్సిందిగా సూచించారు. సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సీఈఐఆర్ బృందం (ఇన్స్పెక్టర్ మొగిలి, ఆర్.ఎస్.ఐ. నిరంజన్, కానిస్టేబుల్స్ రమేష్, రాజి రెడ్డి, హరి కృష్ణ, స్వామి, శ్రీకాంత్ మరియు సీఈఐఆర్ కానిస్టేబుల్స్)ను సిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏ.ఆర్.) సుభాష్ చంద్రబోస్, ఐ.టి. సెల్ ఇన్స్పెక్టర్ మొగిలి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవల్లో నైపుణ్యమే లక్ష్యం

మూడు జిల్లాల 108 సిబ్బందికి ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ



కొత్తగూడెం టౌన్, నవంబర్ 6 (మనం న్యూస్): క్లస్టర్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 108 అత్యవసర వైద్య సేవల సిబ్బందికి ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.కె. నసీరుద్దీన్, మూడు జిల్లాల జిల్లా మేనేజర్లు సతీష్, ప్రణయ్, మనోజ్ పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన శిక్షణ బృందం సభ్యులు అరుణ్ కుమార్ తదితరులు 108 సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో 108 సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తత, సమయపాలన, బాధ్యతాయుతమైన సేవలు ఎంతో అవసరమని పేర్కొంటూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా 108 ఉద్యోగుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచడం, అత్యవసర సమయాల్లో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా శిక్షణ అందించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడువు లోగా పూర్తి చేయాలి

- తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత
- విద్యా శాఖ, ఇందిరమ్మ ఇండ్లు, తాగు నీటి సరఫరాపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్
- కలెక్టర్‌ను అభినందించిన సీఎస్ సంజయ్ జాజు



ఖమ్మం, నవంబర్ 6(మనం బ్యూరో): ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజతో కలిసి ఐడిఓసీ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, పీఎంశ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగం, ఇందిరమ్మ ఇళ్లు, వీబీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రైవేట్ బోర్వెల్స్ ను వినియోగించుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, కొత్త బోర్లను ఏర్పాటు చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పనులను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో డీపీఓ, మిషన్ భగీరథ ఈఈ, పబ్లిక్ హెల్త్ అధికారులు తదితరులతో వారం వారీగా సమీక్ష కమిటీని ఏర్పాటు చేయాలని, మండల స్థాయి కమిటీలను నవంబర్ నెలాఖరులోగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేతి పంపులు, బోరు పంపులు, బావుల మరమ్మతులను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్రాగునీటికి సంబంధించిన సమస్యలన్నింటిని పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ వాల్వుల ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు అక్రమ నీటి కనెక్షన్లను నివారించాలని సూచించారు.

పీఎం శ్రీ, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగం:

పీఎం శ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, మరమ్మతులు తదితర మౌళిక వసతుల పనులను ప్రాధాన్యతతో చేపట్టాలన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ 2026-27 సంవత్సరానికి సంబంధించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఈ నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్షిస్తున్నందున, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటి పురోగతిని సీఎం డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని, నిధుల వినియోగంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. పాఠశాలను అధికారులు తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతను పరిశీలించాలన్నారు.

వీబీజీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం:

వీబీజీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెలాఖరు నాటికి నిర్దేశించిన పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలనీ, గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి నాణ్యతతో చేపట్టడంతో పాటు కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

జిల్లా యంత్రాంగం పనితీరును అభినందించిన సీఎస్:

బేతుపల్లి చెరువులో చిక్కుకున్నవారిని రాత్రింబవళ్లు శ్రమించి, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సురక్షితంగా రక్షించడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర, ఆందోళనకర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ చూపిన చొరవ, నాయకత్వం అందరికీ ఆదర్శమని సీఎస్ ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర సిఎస్ కు వివరిస్తూ ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి 98 శాతం అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.3 కోట్ల విలువైన అవార్డులకు సంబంధించి టోకెన్లు జనరేట్ అయ్యాయని, చెల్లింపులు పెండింగ్లో ఉన్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ డిఆర్డీవో కె. శ్రీరామ్, డిపిఓ వినోద్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, జిల్లాలోని మునిసిపాలిటీల కమిషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా, ప్రశాంతంగా దీపావళి జరుపుకోవాలి

- గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, నవంబర్ 06(మనం బ్యూరో)ః దీపావళి పండుగను పర్యావరణహితంగా, సురక్షితంగా, సంతోషంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని, నైలాన్, పాలిస్టర్ వంటి సింథటిక్ దుస్తులు ధరించకూడదని సూచించారు. భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా కాల్చాలని, టపాసులు కాల్చే ప్రదేశంలో ముందస్తుగా ఒక బకెట్ నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా వారి పక్కనే ఉండి పర్యవేక్షించాలని, బాణాసంచాను జేబుల్లో పెట్టుకోవడం, చేతుల్లో పట్టుకుని తిరగడం చేయకూడదని కలెక్టర్ సూచించారు. వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని, వాటిని నీటితో తడిపి సురక్షితంగా తొలగించాలని పేర్కొన్నారు. ఇళ్లలో, గ్యారేజీల్లో, బాల్కనీల్లో బాణాసంచా కాల్చకూడదని తెలిపారు.

ప్రమిదలు, దీపాలను స్థిరమైన ప్రదేశాల్లో, కర్టెన్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర మండే వస్తువులకు దూరంగా ఉంచాలని, నిద్రించే ముందు లేదా బయటకు వెళ్లే ముందు వెలుగుతున్న దీపాలను ఆర్పివేయాలని సూచించారు. పెంపుడు జంతువులు, వీధి జంతువుల సమీపంలో పెద్ద శబ్దాలు వచ్చే బాణాసంచా కాల్చకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, ప్రమాదాలకు తావులేకుండా కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితమైన, ఆనందకరమైన దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీని

గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- పెండింగ్లో ఉన్న 1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జనవరిలోగా అందించాలి
- ప్రతి నెల కనీసం 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ చేయాలి
- పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై రైస్ మిల్లర్లు, అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్, జిఎం సివిల్ సప్లయ్



ఖమ్మం, నవంబర్ 06(మనం న్యూస్)ః జిల్లాలో రబీ 2024-25, ఖరీఫ్ 2025-26 సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం డెలివరీని వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సప్లైస్ కమీషనర్ కార్యాలయ జీఎం రాజేందర్, డీజీఎం ఇర్ఫాన్ లతో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీ, మిల్లర్ల వారీగా బియ్యం సరఫరా పురోగతి, బకాయి బిల్లుల చెల్లింపులపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రబీ 2024-25, ఖరీఫ్ 2025-26 సీజన్లకు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బియ్యం డెలివరీ పూర్తి చేసేందుకు ప్రతి మిల్లర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యం సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించ వద్దని, గడువులోగా బియ్యం అందించని మిల్లర్లను నిబంధనల ప్రకారం డిఫాల్ట్ మిల్లర్లుగా పరిగణించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పెండింగ్ నిల్వలను ఎప్పటి కప్పుడు తగ్గించుకుంటూ, సివిల్ సప్లైస్కు బియ్యం సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

మిల్లర్ల బకాయి బిల్లులను త్వరితగతిన చెల్లించాలి:

మిల్లర్లకు చెల్లించాల్సిన మిల్లింగ్ ఛార్జీలు, రవాణా ఛార్జీలకు సంబంధించిన బిల్లులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఏ ఒక్క బిల్లు కూడా పెండింగ్లో ఉంచకుండా, బిల్లుల పరిశీలన, ఆమోదం, తదుపరి చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మిల్లర్లకు రావాల్సిన అన్ని రకాల పెండింగ్ చెల్లింపులను త్వరితగతిన క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జీఎం రాజేందర్ కు తెలిపారు. బియ్యం డెలివరీ లక్ష్యాలను సాధించడంతో పాటు మిల్లర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపుల్లో కూడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేస్తూ సీఎంఆర్ బియ్యం డెలివరీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, వారానికి నిర్దేశించిన పురోగతిని సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు.


సివిల్ సప్లైస్ కమీషనర్ కార్యాలయ జీఎం రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీ పెండింగ్ లో 18 లక్షల మెట్రిక్ టన్నులు సివిల్ సప్లైస్కు చేరాల్సి ఉందని తెలిపారు. పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీని వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తూ సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం డెలివరీ పెండింగ్లో ఉండగా, అందులో 1.06 లక్షల మెట్రిక్ టన్నులు సివిల్ సప్లైస్కు అందించాల్సి ఉందని తెలిపారు. సివిల్ సప్లైస్కు పెండింగ్లో ఉన్న 1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జనవరి 31, 2027లోగా తప్పనిసరిగా అందించాలని మిల్లర్లకు సూచించారు.

ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి నెల కనీసం 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతి వారం సీఎంఆర్ డెలివరీ పురోగతిపై సమీక్ష నిర్వహించి, మిల్లర్ల వారీగా సరఫరా వివరాలను పరిశీలిస్తామని, నిరంతరం ఫాలోఅప్ చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, రైస్ మిల్లర్లు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై తిరుగుతూ..

తుఫాను నష్టాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల

- ప్రభుత్వానికి నివేదికలు అందించే ముందు క్షేత్రస్థాయిలో పరిశీలన మంత్రి



దమ్మపేట, నవంబర్ 6(మనం న్యూస్): మురసు తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని స్వయంగా తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, క్షేత్రస్థాయిలో పర్యటించారు. శుక్రవారం దమ్మపేట మండలంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ దెబ్బతిన్న రోడ్లు, నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో రహదారులతోపాటు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో మంత్రి ద్విచక్ర వాహనంపై తిరుగుతూ స్వయంగా పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారితోపాటు దొడ్డ ప్రసాదు, కాసాని నాగప్రసాద్ ఉన్నారు.

బస్తాపై 26 కేజీల ముద్ర

జోకితే 25 కేజీలే...

వినియోగదారులను మోసం చేస్తే కేసులే ...

- జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి కూచన మనోహర్
- నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 6 కేసులు నమోదు
- తక్కువ తూకంతో సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు
- బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 6 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వినియోగదారులకు సరుకులను నిర్ణీత తూకం కంటే తక్కువగా విక్రయిస్తూ మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు. సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని బాబుక్యాంప్, పెద్దబజార్ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ, ప్రతి వ్యాపారి ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయించినా, తూనికలు, కొలతల నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వినియోగదారులు సైతం సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును, తూకాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని, వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తెలిపారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు



అమలాపురం నవంబర్ 6(మనం ప్రతినిధి): అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా తొలుత అన్ని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు తరలిస్తారు.

అనంతరం ఎంపీటీసీకి సంబంధించిన పింక్ బ్యాలెట్లు, జడ్పీటీసీకి సంబంధించిన తెలుపు బ్యాలెట్లను వేరు చేసి ప్రత్యేక డ్రమ్ములో వేసి కలుపుతారు. ఆ తర్వాత కౌంటింగ్ టేబుళ్లలో సగం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు, మిగిలిన సగం జడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించి ప్రక్రియ ప్రారంభిస్తారు. ఒక్కో రౌండ్లో సుమారు 1,000 ఓట్లను లెక్కించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఓ అన్యం రాంబాబు తెలిపారు. ఆయా ఎంపీటీసీ స్థానాల్లో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రెండు నుంచి మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు...

ఎఫ్ఎంజీ వైద్యులపై పోలీసుల ఉక్కుపాదం

ధర్నా చేస్తున్న నిరసనకారుల అరెస్టు

ఇతర వైద్య ఇంటర్న్స్‌తో సమానంగా రూ.29,792 చెల్లించాలని డిమాండ్




హైదరాబాద్, నవంబర్ 6(మనం ప్రతినిధి): తమకు స్టైపెండ్ పెంచాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విదేశీ వైద్య విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ మేరకు కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులను శుక్రవారంనాడు పోలీసులు ఈడ్చుకెళ్లి మరి అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమకు నెలకు రూ.29,792 స్టైఫండ్ చెల్లించాలని, జనవరి 2026 నుంచి పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ.. తెలంగాణలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల పరిధిలోని బోధనాసుపత్రుల్లో ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లు విధులు నిర్వహిస్తున్నామన్నారు. స్థానికంగా ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో సమానంగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ తమకు నెలకు కేవలం రూ.5 వేల స్టైపెండ్ మాత్రమే చెల్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వైద్య ఇంటర్న్స్‌తో సమానంగా రూ.29,792 చెల్లించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ డిమాండ్ల సాధన కోసం విదేశీ వైద్య విద్యార్థులు చేపట్టిన ఆందోళన శుక్రవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం సమీపంలో రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. శుక్రవారం రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ క్రమంలో డీఎంఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన వైద్యులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. జనవరి 2026 నుంచి పెండింగ్లో ఉన్న స్టైపెండ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఇంటర్న్ షిప్ పొడిగింపు పేరుతో ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం హామీ ఇవ్వాలని ఎఫ్ఎంజీ వైద్యులు కోరుతున్నారు.

తమపై ఎలాంటి కక్షపూరిత చర్యలు తీసుకోకూడదని, స్థానిక ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా స్టైపెండ్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరోవైపు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులతో ఈ అంశంపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఎఫ్ఎంజీ ఇంటర్న్స్‌కు న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని వైద్యులు, వైద్య రంగానికి చెందిన పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన బాడిశ నాగ రమేష్



మంగపేట, నవంబర్ 6,మనం ప్రతినిధి: పినపాక మండలం జానంపేట గ్రామంలో నిర్వహించిన చిన్నారి మషీరా పుట్టువెంట్రుకల వేడుకకు ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ హాజరయ్యారు. మంగపేట మండలం పూరేడు పల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు నజ్మా మేనకోడలు ఎస్.కె. యాకూబ్ పాషా, సలీమా దంపతుల కుమార్తె మషీరా వేడుకకు కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ కౌసర్ పాషా, నజ్మా, నయీం, అఫ్రోజ్, వహీద్, కొమరం పుల్లరావు, కల్తీ అశోక్, రూప భద్రయ్య, మునిగేలా మహేష్, మండల సంతోష్, నిట్టా శ్యామ్ (బన్ను), కొమరం నితిన్తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



● మంత్రి సీతక్క

ములుగు నవంబర్ 6,మనం ప్రతినిధి: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను వ్యాపార పెట్టుబడులుగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల సమాఖ్య కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ ద్వారా ఏర్పాటు చేసిన కాజా బటన్ మిషన్ యూనిట్ను మంత్రి ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండల కేంద్రంలో కనకదుర్గ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జనరల్ రిసోర్సెస్ సెంటర్ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాజా బటన్ మిషన్ యూనిట్లు, గాజులు, కిరాణా, కూరగాయలు, వస్త్ర దుకాణాలు వంటి వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించి, రుణాలు తిరిగి చెల్లించడంతోపాటు మరో వ్యాపారాన్ని ప్రారంభించే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు దాదాపు రూ.73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు జమ కావాల్సిన వడ్డీ మొత్తాలను త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 8న కొడంగల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



● జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ, నవంబర్ 6(మనం ప్రతినిధి): తెలంగాణ ప్రజా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ సివిల్, రవాణా, రోడ్లు మరియు భవనాలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఈ పరీక్షలు నిర్వహిస్తున్న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్బీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. రెండు రోజులపాటు నిర్వహించే సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ సివిల్, రవాణా, రోడ్లు మరియు భవనాలు పరీక్షలకు 179 మంది అభ్యర్థులను కేటాయించగా, ఉదయం 10 నుండి 12:30 వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు నిర్వహించిన మొదటిరోజు పరీక్షకు 104 మంది అభ్యర్థులు హాజరుకాగా, 75 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు ప్రతిరోజు పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. భద్రత కట్టుదిట్టంగా ఉండాలని అన్నారు. తనిఖీ దళం మరియు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు శశికళ, పరీక్ష కేంద్రం ప్రధాన పర్యవేక్షకులు నీలం రెడ్డి, శాఖ అధికారి, పరిశీలకులు, నల్లగొండ రెవెన్యూ విభాగ అధికారి వై. అశోక్ రెడ్డి, తెలంగాణ ప్రజా సేవా సంఘం ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

● 11 మంది పట్టివేత..
● 4 కోడి పుంజులు,
● రూ.9,400 నగదు స్వాధీనం



కన్నాయిగూడెం, నవంబరు 6 (మనం న్యూస్): మండలంలో కోడి పందాలు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కన్నాయిగూడెం పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని తుపాకులగూడెం అటవీ ప్రాంతంలో రహస్యంగా కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందాలు ఆడుతున్న 11 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 కోడి పుంజులు, రూ.9,400 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. కోడి పందాలు, జూదం వంటి వ్యసనాలకు యువత, ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. సరదా పేరుతో ప్రారంభమయ్యే జూదం ఆర్థిక నష్టాలకు, కుటుంబ సమస్యలకు దారితీస్తుందని, విలువైన సమయాన్ని, సంపాదనను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమాజంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. మండలంలో కోడి పందాలు, జూదాన్ని పూర్తిగా నియంత్రించడమే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్ స్పష్టం చేశారు. ప్రజలు జూదానికి దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

పల్లె పల్లెకూ సీతక్క.. గడప గడపకూ అభివృద్ధి బాట!

● ప్రజల మధ్యకు వెళ్తూ సమస్యల గుర్తింపు
● సంక్షేమ పథకాల అమలుపై ఆరా
● అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రస్థానం



ములుగు, నవంబర్ 6,మనం ప్రతినిధి: ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కార దిశగా అడుగులు వేస్తున్న ప్రజా నాయకురాలు మంత్రి సీతక్క. అధికారం హోదా కోసం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని తన కార్యాచరణ ద్వారా చాటుతున్నారు. పల్లె పల్లెకూ పర్యటిస్తూ, గడప గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు.

ఏ గ్రామంలో ఏ సమస్య ఉంది? ఏ కుటుంబం ఏ కష్టంలో ఉంది? ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా? అభివృద్ధి పనులు ఏ దశలో ఉన్నాయి? అనే అంశాలపై ఆరా తీస్తూ అధికారుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నారు. సీతక్క పర్యటనలు కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలతో మమేకమయ్యే వేదికలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అడవిబిడ్డగా మొదలైన ఆమె ప్రస్థానం ప్రజా ఉద్యమాల నుంచి రాజకీయ నాయకత్వం వరకు సాగింది. సామాన్యుల కష్టాలను దగ్గరగా చూసిన అనుభవంతో పేదలు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడటమే తన లక్ష్యమనే సంకల్పంతో పనిచేస్తున్నారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందన్న ఆలోచనతో ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించాలనే దిశగా కృషి చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం, ప్రతి కుటుంబంలో సంతోషం నింపడం లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రజా ప్రస్థానంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకం.

బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ నేతల పరామర్శ,ఆర్థిక సహాయం



మంగపేట, నవంబర్ 6, మనం ప్రతినిధి: మంగపేట మండలం బ్రాహ్మణ పల్లి (కింది గుంపు) గ్రామం లో ఇటివలా అనారోగ్యం తో వజ్జా.నవీన్ చనిపోగా,గతం లో చిన్నకొడుకు వజ్జా సునీల్ కూడా అనారోగ్యం తో చనిపోయాడు.ఎదిగిన కొడుకులు చనిపోవడం తో తల్లి తండ్రులు వజ్జా శంకర్ సరోజన దంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.వారికి స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కొంత డబ్బు ను (4000/-) జమ చేసి,వారి కుటుంబ సభ్యులకు ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ చేతుల మీదగా అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ పేదల పార్టీ అని,ప్రతీ ఒక్క పేద కుటుంబానికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పండా శ్రీను,బాడిశ నర్సింగరావు ,చౌలం రాంబాబు,కొమరం పుల్లరావు,కల్తీ అశోక్,రూప భద్రయ్య,మునిగేలా మహేష్,మండల సంతోష్,నిట్టా శ్యామ్ (బన్ను),కొమరం నితిన్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో మహిళలకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

● ఎల్నినో ప్రభావంపై రైతులకు అవగాహన,విత్తనాల పంపిణీ
● ఆహార భద్రత స్మార్ట్ కార్డుల విడుదల..
● ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం చేయాలని అధికారులకు సూచన



కన్నాయిగూడెం, నవంబరు 6 (మనం న్యూస్): కన్నాయిగూడెం మండలంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు అర్హులైన ఐదుగురు మహిళలకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన జనగం రాజశ్రీ, కుమ్మరి మౌనిక, కోరుకొప్పుల సుస్మిత, చిట్యాల గ్రామానికి చెందిన చాట్ల జనని, ఏటూరు గ్రామానికి చెందిన తల్లడి సౌజన్య కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందారు.అనంతరం మండలంలోని రైతులతో సమావేశమై ఎల్నినో వాతావరణ పరిస్థితుల ప్రభావం, రాబోయే రోజుల్లో వ్యవసాయంపై పడే ప్రభావం గురించి వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ కార్డులను విడుదల చేశారు. తదనంతరం కన్నాయిగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన రేగ కళ్యాణి ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ జాడి రాంబాబు, ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, జిల్లా సీనియర్ నాయకులు ఎం.డి. అప్సర్ పాషా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ప పగిడయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ మాదాస్ రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, మండల కోఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్, తుపాకులగూడెం సర్పంచ్ పీర్ల స్వప్న, గుర్రేవుల సర్పంచ్ అంబాల సౌజన్య, చింతగూడెం సర్పంచ్ ఆలం అనిత, కంతనపల్లి సర్పంచ్ చింత చంద్రయ్య, సర్వాయి సర్పంచ్ కోరం రాజు, మండల నాయకులు పూజారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

12 గంటల్లోనే ఇద్దరు బాలుర ఆచూకీ గుర్తింపు



● మహారాష్ట్రలోని షోలాపూర్లో బాలురను గుర్తించిన పటాన్చెరు పోలీసులు
● క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత
● పోలీసులకు కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

పటాన్చెరు, నవంబర్ 6 (మనం న్యూస్) : తప్పిపోయిన ఇద్దరు బాలుర ఆచూకీని పటాన్చెరు పోలీసులు కేవలం 12 గంటల్లోనే గుర్తించి, వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో బాలురు సురక్షితంగా ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. పటాన్చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ఎముల సాయిచరణ్ కుమారులు హర్ష (13), దక్ష్ (11) ఈ నెల 5వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో పటాన్చెరులోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఉన్న వారి నానమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో పటాన్చెరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు క్రైమ్ నంబర్ 1452/2026 కింద భారతీయ న్యాయ సంహిత (ఆఖి) 2023లోని సెక్షన్ 137(2) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పటాన్చెరు పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ, ఇన్స్పెక్టర్ ఎం. రవీందర్ పర్యవేక్షణలో సబ్ఇన్స్పెక్టర్ తాండ్ర పల్లి వినోద్ దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందం వేగంగా స్పందించి గాలింపు చర్యలు చేపట్టడంతో తప్పిపోయిన ఇద్దరు బాలురను మహారాష్ట్రలోని షోలాపూర్లో 12 గంటల్లోనే గుర్తించారు. అనంతరం వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ పిల్లలను సురక్షితంగా తిరిగి అప్పగించిన పటాన్చెరు పోలీసులకు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

68 ఎస్కేల ధాన్యాన్ని రికవరీ చేసుకోండి..
నన్ను ఇబ్బందులకు గురిచేయొద్దు!.



● శ్రీ వీరాంజనేయ రైస్ మిల్ గోడౌన్లో ఉన్న ధాన్యాన్ని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి
● జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, సివిల్ సప్లై ఉన్నతాధికారులకు చీకోటి మురళీధర్ విన్నపం
● బకాయిలు చెల్లించే పరిస్థితి లేదు.. గోడౌన్లోని ధాన్యాన్ని రికవరీ చేసుకుని ప్రభుత్వ బకాయిలకు జమ చేసుకోవాలి



సిరిసిల్ల, నవంబర్ 06 (మనం ప్రతినిధి): ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యం బకాయిల విషయంలో తనను పదేపదే ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేయకుండా, గోడౌన్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని రికవరీ చేసుకోవాలని సీబీఎం రైస్ మిల్ ఇండస్ట్రీ యజమాని చీకోటి మురళీధర్ జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో మానవతా దృక్పథంతో స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యం బకాయిల వ్యవహారం వెలుగులోకి రావడంతో సివిల్ సప్లై అధికారులు ఈ అంశంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శ్రీ వీరాంజనేయ రైస్ మిల్ గోడౌన్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం రికవరీ చేసుకోవాలని మురళీధర్ కోరుతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన 68 ఎస్కేల ధాన్యాన్ని తాను ప్రస్తుతం చెల్లించే పరిస్థితిలో లేనని, అందుబాటులో ఉన్న గోడౌన్ ధాన్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ బకాయిలకు జమ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పదేపదే ఫోన్లు చేసి ఇబ్బంది పెట్టొద్దు..

ధాన్యం బకాయిల విషయమై అధికారులు పదేపదే ఫోన్ చేసి అడగడం వల్ల తాను తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు గోడౌన్లో ఉన్న ధాన్యాన్ని రికవరీ చేసుకోవాలని తానే స్వయంగా కోరుతున్నానని తెలిపారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని పదేపదే ఫోన్లు చేసి ఒత్తిడికి గురిచేయకుండా, ధాన్యం రికవరీ ప్రక్రియను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ జోక్యం చేసుకుని ఆదుకోవాలి!

జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్తో పాటు సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మురళీధర్ కోరారు. గోడౌన్లో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికవరీ చేసుకోవాలని, తద్వారా బకాయిల సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, తన ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని గోడౌన్లోని ధాన్యాన్ని రికవరీ చేసుకోవడమే కాకుండా తనను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని చీకోటి మురళీధర్ జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు.

అర్లగూడెం ఇసుక రీచ్పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

10.50 హెక్టార్లలో ఇసుక తవ్వకాల ప్రతిపాదన
ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాల స్వీకరణ



వాజేడు, నవంబర్6 (మనం న్యూస్): ములుగు జిల్లా వాజేడు మండలం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలోని అర్లగూడెం గ్రామంలో ప్రతిపాదిత ఇసుక రీచ్ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో అర్లగూడెం అంగన్వాడీ కేంద్రం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 10.50 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఇసుక రీచ్కు సంబంధించి పర్యావరణ అనుమతుల ప్రక్రియలో భాగంగా ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇసుక తవ్వకాల వల్ల నదీ పరిసరాలు, పర్యావరణ సమతుల్యత, భూగర్భ జలాలు, వ్యవసాయం, స్థానిక ప్రజల జీవన విధానంపై పడే ప్రభావాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్జీ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ ప్రాంతీయ కార్యాలయం ఇన్చార్జి పర్యావరణ ఇంజినీర్ ఆర్. సునీత, ఏఈ సుభాష్, టీజీఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వంగ వెంకటేశ్వర్లు, టీజీఎండీసీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వాజేడు తహసీల్దార్, ఎంపీడీఓ, వాజేడు ఎస్సై సతీష్తో పాటు స్థానిక గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ఇసుక రీచ్ వల్ల పర్యావరణంపై కలిగే ప్రభావాలు, నదీ పరిసరాల పరిరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను అందజేస్తూ పచ్చదనం ఆవశ్యకతను చాటారు.



చరిత్రను తిరగరాసే దిశగా

డెమోక్రాట్ల అడుగులు

వాషింగ్టన్, నవంబర్ 6: చరిత్రను తిరగరాసే దిశగా డెమోక్రాట్లు అడుగులు వేస్తున్నారు. అమెరికా ప్రజలు ఆ పార్టీకి భారీ మెజారిటీని కట్టబెడుతున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలైన దాదాపు అన్ని స్థానాల్లోనూ ఇప్పుడు డెమోక్రాట్లు విజయకేతనం ఎగురవేశారు. 2024 మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందిన 234 జిల్లాల్లో 52 జిల్లాలను డెమోక్రాట్లు కైవసం చేసుకున్నారు. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. డెమోక్రాట్లు 253 స్థానాలను కైవసం చేసుకోగా.. రిపబ్లికన్లు 155 స్థానాలకు పరిమితమయ్యారు. మరో 27 చోట్ల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఈ క్రమంలో డెమోక్రాట్లు 260 ఫిగర్ను దాటే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అంతకుమించి సాధించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఒకవేళ అదే జరిగితే ప్రతినిధుల సభలో డెమోక్రాట్లకు 85 పైచిలుకు స్థానాల మెజారిటీ లభిస్తుంది. సభలో 60 శాతం మంది వాళ్లే ఉంటారు. 1990 ప్రారంభంలో ఆ పార్టీ అత్యధికంగా 267 స్థానాలను దక్కించుకుంది. ఇప్పటివరకు ఆ పార్టీకి అదే పెద్ద మెజారిటీ. 2008లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ఆ పార్టీ 257 స్థానాలను కైవసం చేసుకుంది. తాజా ఫలితాలతో డెమోక్రాట్లు 1990 చరిత్రను తిరగరాస్తారా.. 2008 మెజారిటీని అధిగమిస్తారా? అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠ చర్యలు

- పెండింగ్, మిస్సింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- జైలు నుంచి విడుదలైన వారిపై నిరంతర పర్యవేక్షణ
- జూదం, పేకాటపై నాలుగు ప్రత్యేక బృందాలతో 24 గంటల నిఘా
- జూదం, పేకాట నిర్మూలనకు నాలుగు ప్రత్యేక బృందాలు: ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి, నవంబర్ 6 (మనం బ్యూరో): జిల్లాలో నేర నియంత్రణ, కేసుల త్వరిత పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిరక్షణపై సమీక్షించారు.

సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలు...

ఈ సందర్భంగా ఎస్పీ సీసీటీఎన్ఎస్ అప్లికేషన్ను స్వయంగా పరిశీలించి వివిధ పోలీస్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలు, ఫొటోలు, వీడియోలు, దర్యాప్తు పత్రాలను నిర్ణీత సమయంలో ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని స్పష్టం చేశారు. శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు.

దీర్ఘకాలిక పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదన...

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసుల పరిష్కారంతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. జైలు నుంచి విడుదలైన వ్యక్తుల వివరాలను ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలో నమోదు చేసి, వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో జూదం, పేకాట నిర్మూలనకు నాలుగు ప్రత్యేక బృందాలతో 24/7 నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూదం ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, గంజాయి అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు.


పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు...

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ అప్రమత్తంగా పనిచేయాలన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, ఎస్. శ్రీనివాసరావు, పి. విట్టలెడ్డి, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాయు కాలుష్యం..

అమల్లోకి మూడో దశ ఆంక్షలు



ఢిల్లీ, నవంబర్ 6 : దేశ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్) పరిధిలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. దీపావళి పండుగ వేళ వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ కమిషన్ మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)-3ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దిల్లీలో గురువారం వాయునాణ్యత 382 మార్కును తాకింది. ఏక్యూఐ 301-400 మధ్య ఉంటే బాగా తక్కువగా ఉన్నట్లు లెక్క. అంతకుమించి నాణ్యత పడిపోయే అవకాశం ఉన్నప్పుడు గ్రాప్-3 ఆంక్షల్ని అమలు చేస్తారు. దీపావళి సందర్భంగా కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రాప్-3 ఆంక్షలు అమల్లోకి వస్తే.. అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధంతో పాటు, బీఎస్-3 లేదా అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్-4 లేదా అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు విధిస్తారు. అంతేకాకుండా కంకర రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని తరలించకుండా నిషేధం విధిస్తారు. స్టోన్ క్రషర్స్, గనుల తవ్వకాలను నిలిపివేస్తారు.

ట్రంప్ బెదిరింపులు..

ఇరాన్ కొత్త ప్రతిపాదనలు

టెహ్రాన్, నవంబర్ 6: యుద్ధం వల్ల రాజకీయంగా నష్టం జరిగినా.. ఇర్నా సైనిక చర్య విషయంలో వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త అణు ప్రతిపాదనను అగ్రరాజ్యానికి ఇరాన్ పంపింది. శాంతి చర్చలు కొనసాగాలంటే తాము అమెరికాకు పంపిన ఏడు డిమాండ్లు అంగీకరించాల్సిందేనని టెహ్రాన్ తేల్చిచెప్పింది. అప్పుడే అణు చర్చలు జరుపుతామని స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ డిమాండ్లు అమెరికాకు చేరాయి. ఇరాన్ పంపిన డిమాండ్ల జాబితా అధికారికంగా బయటకు వెల్లడికాలేదు. అయితే వాటి గురించి అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయడం, ఫ్రీజ్ చేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, యుద్ధం కారణంగా కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించడం, లెబనాన్ వంటి ఇతర ప్రాంతాలలో జరుగుతోన్న ఘర్షణలను పూర్తిగా ముగించడం, ఇరాన్ భూభాగాలపై దాడులు నిలిపివేయడం వంటివి అందులో ఉన్నాయని పేర్కొన్నాయి.

ఇరాన్ వద్ద ఉన్న అత్యంత శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పూర్తిగా వదిలేయాలని అమెరికా డిమాండ్ చేస్తోంది . తమ దేశంలోనే అంతర్జాతీయ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో దానిని నిర్వీర్యం చేయడానికి సిద్ధమే కానీ.. దేశం దాటించేది లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది.

ప్రజాభిప్రాయం.. బెయిల్‌ను నిర్దేశించలేదు: కేరళ హైకోర్టు



తిరువనంతపురం, నవంబర్ 6 : మినీ కూపర్ కారు ప్రమాద ఘటనలో కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాభిప్రాయాలు బెయిల్‌ను నిర్దేశించకూడదని పేర్కొంది. నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నలుగురు నిందితులకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వారిలో ప్రధాన నిందితుడి విడుదలపై మాత్రం పరిమితులు విధించింది. 10 రోజుల తర్వాత అతడిని బెయ్యి విడుదల చేయాలని ఆదేశించింది.

ఆ బహుమతుల వల్లే వాహన కాలుష్యం పెరుగుదల: సుప్రీం కోర్టు

అలప్పుళ సొత్కు చెందిన 19 ఏళ్ల సజీవ్.. గత నెల తన స్నేహితుడితో కలిసి నెడుంబస్సెరి సమీపంలోని ఎయిర్పోర్టు రోడ్డుపై మినీకూపర్‌లో వేగంగా వెళ్తూ.. ఓ స్కూటర్‌ను ఢీకొట్టాడు. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువతులు, ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తుల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన రాష్ట్రంలో తీవ్ర ప్రజాగ్రహానికి దారితీసింది. ఈ క్రమంలోనే నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ జరిగింది. '' కేవలం ప్రజల అభిప్రాయాల ఆధారంగా న్యాయస్థానాలు నిర్ణయాలు తీసుకోవు. చట్టపరమైన నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి'' అని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది.

టెక్సాస్‌పై డెమోక్రాట్ల జెండా

5 రాష్ట్రాల్లో క్లీన్‌స్వీప్



వాషింగ్టన్, నవంబర్ 6 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీ సాధించిన డెమోక్రటిక్ పార్టీ మరింతగా దూసుకెళ్తోంది. రిపబ్లికన్ పార్టీకి ఎప్పటి నుంచో ఆయువుపట్టుగా ఉన్న టెక్సాస్ను చేజిక్కించుకోవడం ఆ పార్టీకి అతి పెద్ద విజయం.

ఇప్పటికే టెక్సాస్ గవర్నర్, సెనెట్ సీట్లను గెలుచుకున్న డెమోక్రటిక్ పార్టీ.. రాష్ట్ర ప్రతినిధుల సభపైనా పట్టు సాధించింది. 2002 నుంచి టెక్సాస్‌పై రిపబ్లికన్ పార్టీ ఆధిపత్యమే కొనసాగుతోంది. 24 ఏళ్ల తర్వాత డెమోక్రాట్లకు ఈ రాష్ట్రంపై పట్టు చిక్కింది. గతంలో అధికారాన్ని పంచుకున్న 5 రాష్ట్రాల్లో డెమోక్రటిక్ పార్టీకి పూర్తి ఆధిపత్యం లభించింది. ఈ రాష్ట్రాల్లో గవర్నర్ పదవులను దక్కించుకోవడంతోపాటు రాష్ట్ర సభల్లోనూ ఆధిక్యం సాధించింది. మిషిగన్, మిన్నెసోటా, పెన్సిల్వేనియాల్లో ఉభయ సభలు, గవర్నర్ పదవులు డెమోక్రాట్లకే దక్కాయి. నెవాడాలోనూ ఇవే ఫలితాలొచ్చాయి.

భారత సంతతి షా రికార్డు

ఆరిజోనాలోని 1వ కాంగ్రెషనల్ జిల్లా నుంచి ప్రతినిధుల సభకు అమీష్ షా ఎన్నికయ్యారు. ఈ రాష్ట్రం నుంచి సభకు ఎన్నికైన తొలి భారత సంతతి నేతగా ఆయన నిలిచారు. వైద్యుడైన 48 ఏళ్ల షా.. సభకు ఎన్నికైన ఆరో నేత. అమీష్ షా.. గుజరాతీ దంపతులకు షికాగోలో జన్మించారు. లాస్ ఏంజెలెస్ మేయర్ పోరులో భారత సంతతికి చెందిన నిత్యా రామన్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆమె సిటింగ్ మేయర్ కరెన్ బాస్ను వెనక్కినెట్టి ముందుకు సాగుతున్నారు.

ఎన్డీయే కోసం సోనియా

ఓటు చోరీ చేశారా?

బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

ఢిల్లీ, నవంబర్ 6 : ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మండిపడ్డారు. గతంతో పోలిస్తే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపు శాతం తక్కువగానే ఉందని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. గతంలో సీఈసీగా వీఎస్ సంపత్ ఉన్నప్పటితో పోలిస్తే.. నేడు జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నప్పుడు ఎన్డీయే సాధించిన గెలుపు శాతం తక్కువగానే ఉందన్నారు. మరి, అప్పుడు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఎన్డీయే కోసం ఓటు చోరీకి పాల్పడ్డారా? అని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే వీఎస్ సంపత్ 2012 జూన్ నుంచి 2015 జనవరి వరకు సీఈసీగా బాధ్యతల్లో ఉన్నారని గుర్తు చేశారు.

వీఎస్ సంపత్ సీఈసీగా ఉన్నప్పుడు ఎన్డీయే గెలుపు శాతం 75శాతం కాగా జ్ఞానేశ్ కుమార్ వచ్చాక అది 66శాతంగానే ఉందని తెలిపారు. వీఎస్ సంపత్ ఉన్నప్పుడే భాజపా స్ట్రైక్ రేట్ అధికమన్నారు. మరి, రాహుల్ గాంధీ లెక్క ప్రకారం చూస్తే.. సోనియా గాంధీ బీజేపీ కోసం ఓట్లచోరీ చేశారా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారని రాహుల్ చెబుతున్నారని.. కానీ, వాస్తవాలు, గణాంకాలు ఆయన ఆరోపణలు తప్పని నిరూపిస్తున్నాయని తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ 2024 మార్చిలో సీఈసీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.



పుట్టపర్తికి గవర్నర్ రాక.. రత్నాకర్ ప్రత్యేక ఆహ్వానం!

ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్ 45వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా జస్టిస్ అబ్దుల్ నజీర్

నవంబర్ 22న ప్రశాంతి నిలయంలో పట్టభద్రుల వేడుక...ఆహ్వానాన్ని సంతోషంగా అంగీకరించిన ఆంధ్రప్రదేశ్



పుట్టపర్తి, నవంబర్ 6 మనం న్యూస్: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో మరో ప్రతిష్ఠాత్మక విద్యా వేడుకకు రంగం సిద్ధమవుతోంది. శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 45వ స్నాతకోత్సవానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ గవర్నర్ను కలిసి స్నాతకోత్సవానికి హాజరుకావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. నవంబర్ 22వ తేదీ ఉదయం 11 గంటలకు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఈ స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని రత్నాకర్ చేసిన ఆహ్వానాన్ని గవర్నర్ సంతోషంగా అంగీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రశాంతి నిలయాన్ని సందర్శించడం, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గవర్నర్ రాకతో 45వ స్నాతకోత్సవ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకోనుంది

విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న కాస్మోస్ డైమండ్స్

ఎం.జి. రోడ్డులో నూతన, విశాలమైన స్టోర్తో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది



విజయవాడ, నవంబర్ 6 : విజయవాడలో తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్థానిక ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెల్లరీ బ్రాండ 'కాస్మోస్ డైమండ్స్', బెంజ్ సర్కిల్ సమీపంలోని ఎం.జి.రోడ్డులో విశాలమైన, నూతన స్టోర్ను ప్రారంభించింది. ఈ కొత్త స్టోర్ బ్రాండ్ ప్రారంభమైన నగరంలో సంస్థ నిరంతర వృద్ధికి ప్రతీకగా నిలవడంతో పాటు, కస్టమర్లకు మెరుగైన రిటైల్ అనుభవాన్ని, ల్యాబ్-గ్రోన్ డైమండ్ ఆభరణాల అతిపెద్ద కలెక్షన్లలో ఒకదానిని అందిస్తుంది. కాస్మోస్ డైమండ్స్ ఫౌండర్ సంజనా త్రిపురమల్లు(Sanjana Tripuramallu) ఈ స్టోర్ను ప్రారంభించారు. 2021లో ప్రారంభమైన కాస్మోస్ డైమండ్స్.. డైమండ్ ఆభరణాల కొనుగోలును మరింత పారదర్శకంగా, సులభంగా మరియు పూర్తి అవగాహనతో కూడినదిగా మార్చాలనే లక్ష్యంతో విజయవాడలో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. అప్పటి నుండి ఈ బ్రాండ్ విజయవాడలో తన మూలాలను మరింత బలోపేతం చేసుకుంటూనే, హైదరాబాద్, బెంగళూరు నగరాలకు కూడా తన సేవలను విస్తరించింది. నేడు ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా కస్టమర్లకు సేవనందించిన కాస్మోస్ డైమండ్స్.. ల్యాబ్-గ్రోన్ డైమండ్స్ పట్ల పెరుగుతున్న ఆదరణను, కస్టమర్లు తమ బ్రాండ్ ఉంచిన నమ్మకాన్ని చాటుతోంది. విజయవాడలో ప్రారంభమైన ఈ కొత్త స్టోర్లో సమకాలీన, సంప్రదాయ, రోజువారీ మరియు ప్రత్యేక వేడుకలకు సరిపోయే వెయ్యికి పైగా డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. సున్నితమైన రోజువారీ ఆభరణాల నుండి మోడ్రన్ స్టేట్మెంట్ పీస్లు, దక్షిణ భారత సంప్రదాయ స్ఫూర్తితో రూపొందించిన డిజైన్లు, ఎంగేజ్మెంట్ రింగులు మరియు వెడ్డింగ్ కలెక్షన్ల వరకు విస్తృత శ్రేణి రకాలను కస్టమర్లు ఒకే చోట చూడొచ్చు.

కాస్మోస్ డైమండ్స్ షాపింగ్ అనుభవంలో పారదర్శకత ఎప్పుడూ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ బ్రాండ్ హాల్మార్క్ బంగారు ఆభరణాలు, డైమండ్ సర్టిఫికేషన్తో పాటు వర్తించే నిబంధనలు మరియు షరతులకు లోబడి 100% బైబ్యాక్ మరియు ఎక్స్ఛేంజ్ పాలసీని అందిస్తుంది. డిజైన్, నైపుణ్యం మరియు కస్టమర్ అనుభవంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వంటి చర్యల ద్వారా కాస్మోస్ తమ కస్టమర్లతో శాశ్వత బంధాన్ని ఏర్పరుచుకోగలిగింది. కేవలం ఆభరణాలకే పరిమితం కాకుండా, ల్యాబ్-గ్రోన్ డైమండ్స్ సంప్రదాయ ఆభరణాలకు అతీతంగా ఏయే రంగాలను సూచించగలవో కూడా కాస్మోస్ డైమండ్స్ అన్వేషిస్తోంది. 2026 జులైలో ఈ బ్రాండ్కు చెందిన 'కాస్మిక్ బ్లూమ్' డైమండ్ ఆర్ట్వర్క్.. స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1 రాకెట్ ద్వారా అంతరిక్ష ప్రయాణం చేసింది. మొత్తం 16.95 క్యారెట్ల బరువున్న 32 ల్యాబ్-గ్రోన్ పియర్-కట్ డైమండ్స్తో రూపొందించిన ఈ కళాఖండాన్ని, బంగారంతో అమర్చి రాకెట్ ప్రయోగ పరిస్థితులను తట్టుకునేలా రూపొందించిన అల్యూమినియం ప్లేట్ బిగించారు.

కాస్మిక్ బ్లూమ్ ప్రాజెక్ట్ అనేది వజ్రాల గురించిన సంప్రదాయ ఆలోచనలను సవాల్ చేస్తూ, డిజైన్, టెక్నాలజీ, నూతన రంగాలలో వాటి సరికొత్త అవకాశాలను అన్వేషించాలనే కాస్మోస్ డైమండ్స్ ఆకాంక్షను ప్రతిబింబిస్తుంది. స్కైరూట్ ఏరోస్పేస్తో భాగస్వామ్యం ద్వారా, విక్రమ్-2 వంటి రాబోయే మిషన్లతో సహా దేశంలో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగానికి భవిష్యత్తును అందించడంలో ఈ బ్రాండ్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. విజయవాడలో కొత్తగా ప్రారంభించిన ఈ విశాలమైన స్టోర్తో.. గత ఐదేళ్లలో సాధించిన విస్తృతి, వైవిధ్యం, కస్టమర్లకిచ్చే ప్రాధాన్యతను మేళవిస్తూ కాస్మోస్ డైమండ్స్ నగరంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సవిత



పెనుకొండ నవంబర్ 6 మనం న్యూస్: పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఎన్టీఆర్ వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ) పథకం మంజూరైన నేపథ్యంలో శుక్రవారం మంత్రి సవిత ఆసుపత్రిని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అర్హులైన పేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు చేరువ చేసేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు.ప్రజలు ఎన్టీఆర్ వైద్య సేవల పథకాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన వైద్య చికిత్సలు పొందాలని మంత్రి సవిత సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, పట్టణ కన్వినర్ శ్రీరాములు, మండల కన్వీనర్ దండు ఈశ్వర ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడు, ఇస్లాపురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, నాగులూరు నారాయణస్వామి, మాధవ నాయుడు, బిజెపి రామకృష్ణ, రఘు, రామలింగ, డ్వాక్రా రామాంజనేయులు, నంజుండ, గోపాల్, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో ఏమాత్రం పొరపాటుకు తావివ్వొద్దు!

- పరిషత్ ఫలితాల వెల్లడిలో పారదర్శకతే ప్రామాణికం కావాలి
- ఎన్నికల సంఘం నిబంధనలే ప్రథమ ప్రాధాన్యం.. సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం

కొత్తచెరువు, నవంబర్ 6 మనం న్యూస్: ఎన్నికల సమరంలో కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు యంత్రాంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ సమయంలో చిన్నపాటి పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపును పూర్తి పారదర్శకతతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు.

శుక్రవారం కొత్తచెరువులోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి లెక్కింపు విధానాలు, బాధ్యతలు, పాటించాల్సిన ఎన్నికల నియమావళిపై పలు సూచనలు చేశారు.

శనివారం (నవంబర్ 7) నిర్వహించనున్న ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్



హుజూర్ నగర్, నవంబర్ 06 (మనం న్యూస్): రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజకవర్గ కేంద్రంలో 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ప్రారంభించా పోతున్నామని తెలిపారు. మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం, సభాస్థలి పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, గ్రీనరీలో నాటిన మొక్కలకు నీరు అందించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే నరసింహ, ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ జబ్బార్, సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పేరిట రైతులకు కుచ్చుటోపీ!

యారో ఫామ్స్ రోటవేటర్ అసలు ధర ఎంత? ప్రభుత్వ సబ్సిడీ ఎంత?

నాసిరకం పరికరాల పంపిణీ వెనుక అధికారుల పాత్ర ఏమిటి?

కంపెనీలకు - అధికారులకు మధ్య కుమ్మక్కు ఆరోపణలు.. క్విడ్ ప్రోకో జరిగిందా?

25 నుంచి 30 మంది రైతులకు నష్టం.. సమగ్ర విచారణకు బాధితుల డిమాండ్



దేవరకొండ నవంబర్ 6 (మనం న్యూస్): రైతుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ పథకాల ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందిస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు రైతులకు ఆ పథకాలు శాపంగా మారుతున్నాయా? రైతులకు నాణ్యమైన వ్యవసాయ పరికరాలు అందించాల్సిన వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే నాసిరకం యంత్రాలు పంపిణీ అయ్యాయనే ఆరోపణలు దేవరకొండ నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎస్ఎంఏఎం (ఖిఱఱ) పథకం కింద సబ్సిడీపై అందించిన యారో ఫామ్స్ కంపెనీ రోటవేటర్ల వ్యవహారం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. రైతులకు అందించిన యంత్రాల అసలు ధర ఎంత? ప్రభుత్వం చెల్లించిన సబ్సిడీ ఎంత? రైతుల నుంచి వసూలు చేసిన డిపాజిట్ సొమ్ము ఎంత? నాసిరకం పరికరాల సరఫరాకు బాధ్యులెవరు? అనే ప్రశ్నలు రైతాంగం నుంచి వెల్లువెత్తుతున్నాయి.

రూ.65 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్లు.. అయినా నాసిరకం యంత్రాలేనా? బాధిత రైతుల కథనం ప్రకారం ఒక్కో లబ్ధిదారుడి నుంచి సుమారు రూ.65 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్ రూపంలో డీడీలు తీసుకున్నారు. ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్న నేపథ్యంలో రైతులు నాణ్యమైన యంత్రాలు వస్తాయని ఆశించారు. కానీ చివరకు వ్యవసాయ పనులకు సక్రమంగా ఉపయోగపడని రోటవేటర్లు అందించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత యంత్రాలకు కొత్త రంగులు వేసి, కొత్తవిగా చూపించి రైతులకు అంటగట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొదట తిరస్కరణ.. ఆ తర్వాత రంగులు, లేబుళ్లతో ప్రత్యక్షం!

ఇతర రాష్ట్రాల నుంచి యారో ఫామ్స్ కంపెనీకి చెందిన రోటవేటర్లను తీసుకొచ్చి పంపిణీకి సిద్ధం చేసిన సమయంలో వాటి నాణ్యత, రూపురేఖలు, కంపెనీ లేబుళ్లు, రంగులపై రైతులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. కొందరు రైతులు వాటిని తీసుకోవడానికి నిరాకరించి ఆందోళనకు దిగినట్లు బాధితులు చెబుతున్నారు. అనంతరం అదే యంత్రాలకు మళ్లీ రంగులు వేసి, కంపెనీ లేబుళ్లు అంటించి తీసుకొచ్చారని ఆరోపిస్తున్నారు. యంత్రాలను తీసుకోకపోతే డిపాజిట్ డీడీలు తిరిగి రావని, ఇతర లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పి తమపై ఒత్తిడి తెచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? యంత్రాల సరఫరా సమయంలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారా? పరిశీలిస్తే లోపాలున్న పరికరాలను ఎలా ఆమోదించారు? అన్నది వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. రైతుల కోసం రూపొందించిన సబ్సిడీ పథకాలు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టేందుకా? లేక రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకా? దేవరకొండ రోటవేటర్ల వ్యవహారంలో తలెత్తుతున్న ప్రశ్నలకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



తిరుమలగిరి నవంబర్ 6 (మనం న్యూస్): తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని 5వ,వార్డులో ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే మండల సామేలు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. భూతం పద్మ రాంబాబు ఇట్టి నిర్మాణానికి పూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరి జనార్ధన్, పట్టణ అధ్యక్షులు వెంకట లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



తిరుమలగిరి, నవంబర్ 6 (మనం న్యూస్): ఆడపిల్లలపై జరిగిన దాడిని చట్టపరిధిలో విచారించి చర్యలు తీసుకోమని వెళ్లిన వారిపై చేయి చేసుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థ అజయ్ చారిటీ ఫౌండర్ డైరెక్టర్ ఇరుగు సంపోను సుధాకర్ కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ మహిళలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు ఆడపిల్లలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత దళిత సంఘాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు పోలీస్ స్టేషన్ వెళ్లి అడిగినందుకు రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పోలీసులు దాడి చేసిన వారిని వదిలేసి పిర్యాదు చేసిన వారిపై దారుణంగా పోలీసులు కొట్టి భయభ్రాంతులకు గురిచేశారనితెలిపారు. ఎవరు పోలీస్ స్టేషన్ కు వెళ్లిన రక్షించవలసిన పోలీసులే భక్షక బటులుగా మారుతున్నారని ఆరోపించారు. ఆడపిల్లల మీద దాడులు జరుగుతున్నాయని పోలీస్ స్టేషన్ కు వెళితే విశిక్షణ రహితంగా కొట్టారని ఎక్కడ ఆడపిల్లల మీద దాడులు జరిగిన ఖచ్చితంగా చట్టబద్ధంగా శిక్ష వేయాలన్నారు. ఆడపిల్లలు చేయరాని తప్పు ఏదైనా చేస్తే చట్టానికి అప్పగించాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరు చేసిన మైనార్టీ సంఘం నాయకులుగా స్వచ్ఛంద సేవ నాయకులుగా అడుగుతున్నామని, కొంతమంది పోలీసులు అతి ఉత్సాహం చూపిస్తు మైనార్టీ నాయకుల పైన లాఠీలతో కొడుతున్నారని చెప్పారు. దళితుల బంధువు దళితుల పాడేను మోసి దళిత నాయకుడు అని పేరు తెచ్చుకున్న దళిత పక్షపాతిని అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ఇలాంటి అమానుష్య సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. విచక్షణ రహితంగా కొడుతుంటే అక్కడ ఉన్న ఎస్సీ, కలెక్టర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. న్యాయం కోసం వెళ్ళిన వారిని కొట్టి డీసీఎం లో తరలించి ప్రజల మీద ప్రజా సంఘాల మీద కేసులు పెట్టడం అమానుష చర్యగా భావిస్తున్నామన్నారు. మందకృష్ణ మాదిగ సారాధ్యంలో అద్దంకి రంజిత్, మేడి రాజీవ్ సాగర్, దుర్గం ప్రభాకర్, మైనార్టీ నాయకులు జ్యోతి రాజ్, అనేక మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల నాయకులను కాల్లు విరగొట్టడం న్యాయమా సంపోను ప్రశ్నించారు.నాయకుల పై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రాజులైన పోలీసులపై చర్య తీసుకోకూటె ఆందోళన చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగ చారి, బిక్షమయ్య గౌడ్, ఈదుల పద్మమ్మ, కందుకూరి యాదమ్మ, సైదులు, రూతు సంగీత, అజయ్ పాలు, శాస్త్రి, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

పిల్లల అభిప్రాయాలే ప్రాధాన్యం కలెక్టర్



సూర్యాపేట, నవంబర్ 06 (మనం ప్రతినిధి): జిల్లాను చైల్ ఫ్రెండ్లీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది. పిల్లల అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు యూనిసెఫ్ సహకారంతో చేపట్టిన 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు.జిల్లాలో గుర్తించిన 100 పాఠశాలల్లో జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 6 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రూప్ డిస్కషన్ల ద్వారా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారు. తమ ఆలోచనలు, అభిరుచులు, భవిష్యత్తు లక్ష్యాలతో పాటు పాఠశాలలు, గ్రామాల్లో తమకు సురక్షితంగా అనిపించే ప్రాంతాలు, ఇబ్బందులు ఎదురయ్యే ప్రదేశాల గురించి వివరించారు. తమ గ్రామాలు, పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండాలనుకుంటున్నారో, పిల్లలకు అనుకూలమైన అంశాలేమిటో, ఎదురవుతున్న సమస్యలేమిటో తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఉత్సాహంగా చర్చల్లో పాల్గొని తమ మనోభావాలను వ్యక్తం చేశారు.

పిల్లల అవసరాలపై ప్రత్యేక దృష్టి...


పిల్లల అభిప్రాయాలను వినడం, వారి హక్కులను పరిరక్షించడం ద్వారా మాత్రమే చైల్ ఫ్రెండ్లీ జిల్లాను నిర్మించగలమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. ఎల్టిసి కార్యక్రమం ద్వార సేకరించిన అభిప్రాయాలు, సూచనల ఆధారంగా పిల్లల అవసరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శక్తి హబ్, సఖీ కేంద్రం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ పే మోసాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు



తిరుమలగిరి, నవంబర్ 06 (మనం న్యూస్): ఆపదలో ఉన్నాను ఫోన్ పే ద్వారా డబ్బులు కొడితే తాను వచ్చాక నగదు ఇస్తానని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిని తిరుమలగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. శుక్రవారం ఎస్ఐ వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా ఎదురుగా ఉన్న షాపు యజమానినని షాప్ లో పనిచేసే వర్కర్నని, మీ బంధువునని ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో ఉన్నాడని, డబ్బులు ఫోన్ పే ద్వారా పంపాలని చెబితే ఎవరు నమ్మవద్దని తెలిపారు. ఇలాంటి మోసం పాల్పడిన హైదరాబాద్ హిమాయత్ నగర్ కు చెందిన కేతవత్ రాజేష్ అరెస్టు చేసి రిమాండ్ తరలించమని తెలిపారు.

ఇతను తిరుమలగిరి పట్టణంలో దివ్య ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాపు యజమానికి అక్టోబర్ 26న ఫోన్ చేసి నేను మీ షాపు ఎదురుగా ఉన్న మాతాజీ ఎలక్ట్రికల్స్ షాప్ యొక్క యజమాని అని మాయ మాటలు చెప్పి అతనిని నమ్మించి అతని వద్ద నుండి ఫోన్ పే స్కానర్ ద్వారా 30 వేల రూపాయలు కొట్టించుకోని మోసం చేశాడని తెలిపారు. అదే రోజు రామాంజనేయ బోర్ వెల్ యజమానికి ఫోన్ చేసి నేను మీకు తెలిసినటువంటి అభి వెల్డింగ్ వరక్స్ ఓనర్ అభి ని మాట్లాడుతున్నానని చెప్పి ప్రస్తుతం ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో ఉన్నానని మాయమాటలు చెప్పి నమ్మించి అతని వద్ద నుండి 15వేల రూపాయలు ఫోన్ పే స్కానర్ ద్వారా కొట్టించుకున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.



భిక్కనూర్‌లో ప్రత్యక్ష యమపురి..

ఎంఎస్ఎన్ పరిశ్రమలో మరోసారి రియాక్టర్ పేలుడు!

ఐదుగురు ఉద్యోగులకు తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం అని సమాచారం

అధికారికంగా వివరాలు స్వీకరించాల్సిన అవసరం ఉంది.

ప్రమాదాల పరంపరతో భయాందోళనలో ప్రజలు..

అధికారుల పర్యవేక్షణ ఏది? పాలకుల బాధ్యత ఏమిటి?

భిక్కనూర్, నవంబర్ 06 (మనం న్యూస్): మండల కేంద్రంలోని ఎంఎస్ఎన్ పరిశ్రమలో గురువారం రియాక్టర్ పేలుడు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఐదుగురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పరిశ్రమలో చోటుచేసుకున్న ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం బయటకు రాకుండా పరిశ్రమ యాజమాన్యం జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాయపడిన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రమాదానికి గల అసలు కారణాలు బాధితుల ప్రస్తుత పరిస్థితిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

ప్రమాదాలు పునరావృతమవుతున్నా.. పట్టించుకునే వారేరీ?

పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రతి ప్రమాదం తర్వాత కొద్దిరోజులు హడావుడి చేయడం ఆ తర్వాత మళ్లీ మౌనం వహించడం పరిపాటిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల భద్రతా ప్రమాణాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారా? కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించే రక్షణ చర్యలు అమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమా.. నాయకుల మౌనమా?

పరిశ్రమల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందో ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఈ తరహా ఘటనలపై స్పందించకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. పరిశ్రమల వల్ల ఉపాధి కలగడం ఎంత ముఖ్యమో అక్కడ పనిచేసే కార్మికుల ప్రాణాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం.

రేపు భారీ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

చిన్నచిన్న ప్రమాదాలనే హెచ్చరికలుగా తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చే ప్రమాదం ఉంది. ఏదైనా పెద్ద స్థాయిలో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరు వహిస్తారు? బాధిత కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?

జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరిశ్రమలో జరిగిన పేలుడుపై సమగ్ర విచారణ జరిపించాలని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- **కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి**
- **జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి**



కర్నూలు,మనం న్యూస్ నవంబర్ 6: జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై స్పెషల్ ఆఫీసర్లు, ఆర్వో లు, ఏ ఆర్వోలు తదితరులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, అనుమానాలకు తావులేకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ తెరిచే సమయంలో ప్రతి రాజకీయ పార్టీ నుంచి అభ్యర్థులు లేదా వారి కౌంటింగ్ ఏజెంట్లకు ముందస్తుగా సమాచారం అందించి, వారి హాజరును నిర్ధారించుకోవాలన్నారు..స్ట్రాంగ్ రూమ్ తెరవడం, సీల్ తొలగించడం, బ్యాలెట్ బాక్సులను బయటకు తీసే ప్రక్రియను పూర్తిగా వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు... ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. మొదటి రౌండ్ కౌంటింగ్ కనీసం ఉదయం 10.30 గంటలలోపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లు గుర్తించడంపై కౌంటింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన, స్పష్టత ఉండాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద చెల్లుబాటు అయ్యే, చెల్లని ఓట్లకు సంబంధించిన నమూనా ప్రింటెడ్ మెటీరియల్స్ను అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు ఉదయం 7 నుంచి 7.30 గంటల మధ్య సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, ఓట్ల చెల్లుబాటుపై సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ప్రారంభ రౌండ్లో కొంత సమయం తీసుకున్నప్పటికీ, ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏదైనా బ్యాలెట్ పేపర్ సందేహం తలెత్తితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి వెంటనే తెలియజేయాలని, ఆయన సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రౌండ్లో అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఖచ్చితంగా లెక్కించి, వివరాలను ఎక్సెల్లో నమోదు చేసి ప్రింట్ తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో కంప్యూటర్లు, ల్యాప్టాప్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన సదుపాయాలు, కౌంటింగ్ సిబ్బందికి అల్పాహారం, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలన్నారు. కౌంటింగ్ హాల్కు దూరంగా తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది మొబైల్ ఫోన్లను కౌంటింగ్ హాల్లోకి అనుమతించకూడదని, వాటిని భద్రపరిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత ఏ కారణంతోనూ ప్రక్రియను నిలిపివేయడానికి వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏదైనా వ్యత్యాసం, సీరియల్ నంబర్లలో తేడా లేదా ఓట్ల లెక్కింపులో సందేహం తలెత్తితే సంబంధిత అంశాన్ని వెంటనే రికార్డు చేసి, రిటర్నింగ్ అధికారికి తెలియజేసి, కౌంటింగ్ కొనసాగించాలన్నారు.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు తమ బాధ్యతలను అత్యంత అప్రమత్తంగా నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు నిబంధనల ప్రకారం పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, ఆర్వో లు, ఏ ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సేవా నిరతి అభినందనీయం



మహానంది, నవంబర్6,మనంన్యూస్: చిన్నతనంలోనే విద్యార్థులు సేవా నిరతి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని మహానంది దేవస్థానం చైర్మన్ నరాల మోశీశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని చెంచు లక్ష్మీ గూడెంలో గిరిజనులకు నంద్యాల ఆర్ జి ఎం పాఠశాల విద్యార్థులు పేదలతో ఆనందాన్ని పంచుకోవడం లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ జి ఎం పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి చైర్మన్ తో పాటు తహశీల్దార్ రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో పొందే ఆనందం మాటలతో చెప్పలేమన్నారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ చిన్నతనం నుండే విద్యార్థులకు సమాజ సేవ పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.చెంచుగూడెం వాసుల ఆనందానికి విద్యార్థులు చేసిన సహకారం ఎంతో గొప్పతనమని అన్నారు. ప్రిన్సిపల్ గాయత్రి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాల జ్ఞానానికి పరిమితం కాకుండా సేవాభావం,మానవీయ విలువలు, దాయాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే తమ పాఠశాల ఉద్దేశ్యం అని తెలిపారు.రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని గిరిజనులకు నిత్యావసర సరుకులు, టపాసులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు గిరిజనుల జీవన విధానాలగురించి తెలుసుకున్నారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన విధానాలను గిరిజనులతో పంచుకున్నారు. గిరిజన మహిళలు చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్ జి ఎం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ఉమాదేవి,నాయకులు లక్ష్మీ నారాయణ, రాజా, రమణ, సుదర్శన్ రెడ్డి, మహేష్,గిరిజనులు,తదితరులు పాల్గొన్నారు.

శంకర్ నాయక్ పదవి విరమణ



హనుమకొండ, నవంబర్ 6 (మనం న్యూస్): హట్కర్ శంకర్ నాయక్ కు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల నుంచి కాజీపేట బ్రిడ్జి సమీపంలోని ఫాతిమా కాంప్లెక్స్లో ఉన్న వైష్ణవి గ్రాండ్స్లో నిర్వహించగా. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై పదవీ విరమణ పొందుతున్న హట్కర్ శంకర్ సార్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్ ప్రొఫెసర్ సురేష్ లాల్ మాజీ జెడ్పిటిసి వీరమ్మ గోపి సింగ్ మాజీ జెడ్పిటిసి సత్యవతి భిక్షపతి నాయక్ డాక్టర్ మంజుల చందు నాయక్ సీనియర్ జర్నలిస్ట్ లావుడియా పల్లవి రాజు నాయక్ మూడు రమేష్ నాయక్ గంగు నాయక్ రామన్న నాయక్ అనంతరం రమేష్ నాయక్ నాయక్ అజ్మేర వెంకట్ భాస్కర్ నాయక్ ఈ వేడుకకు హట్కర్ శ్రీకాంత్ - మౌనిక, బానోత్ సందీప్ పాటిల్ - సొని, జటోత్ నరేష్ బాబు - శిరీష, హట్కర్ నరమ్మతో పాటు మనవళ్లు, మనవరాళ్లు ఆహ్వానించారు. . పదవీ విరమణ సందర్భంగా హట్కర్ శంకర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలం

కంగన్ హాల్ నుంచి పెట్రోల్ బంక్ దాకా మహిళలే వ్యాపారవేత్తలు : మంత్రి సీతక్క



ములుగు, నవంబర్ 6,మనం ప్రతినిధి: మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలమని, మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించేందుకు ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రభుత్వం విభిన్న వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. శుక్రవారం ములుగు మండలంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జంగాలపల్లి, ఇంచర్ల గ్రామాల్లో మొత్తం రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన ఐదు దుకాణాలను మంత్రి ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ ద్వారా జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణం, కంగన్ హాల్, కిరాణా దుకాణంతోపాటు గ్రామ సంఘం కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ ద్వారా ఇంచర్లలో ఏర్పాటు చేసిన రెండు కిరాణా దుకాణాలను ప్రారంభించారు. తదనంతరం ములుగు మండలం గట్టమ్మ ప్రాంతంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సహకారంతో రూ.150 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న గట్టమ్మ మహిళా సమాఖ్య ఫిల్లింగ్ స్టేషన్కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంచర్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కిరాణా, వస్త్ర, గాజుల దుకాణాలతోపాటు పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ యూనిట్లు, బస్సుల నిర్వహణ, యూనిఫాంల కుట్టు వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తమకు అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గట్టమ్మ మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి మహిళా సంఘాలకు అప్పగించాలని బీపీసీఎల్ ప్రతినిధులను మంత్రి కోరారు. శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్కు ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవం నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల నిర్వహణను మహిళలు చేపట్టి, సమాఖ్య సభ్యులకు ఆదాయం సమకూర్చేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళల రాకపోకలకు ఆర్థిక భారం తగ్గిస్తోందని, మహిళల పురోగతికి ఉపయోగపడే అవకాశాలను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నెల 8న ఆదివారం కొడంగల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో కొత్తగా దాదాపు నాలుగున్నర లక్షల మందికి పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో మూడున్నర లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో గుర్తించి పంపిన అర్హుల వివరాల ఆధారంగా ఒంటరి మహిళలు, భర్తలు లేని మహిళలకు పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 22 సబ్స్టేషన్లు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, సరిచేసే పనులకు ఇటీవల రూ.3 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంకా అవసరమైన గ్రామాలను గుర్తించి ఆయా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం కొత్త ఉపకేంద్రాలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అవసరాలను కూడా అధికారుల దృష్టికి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అనవసర అంతరాయాలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు వస్తున్న అంశాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్, విద్యుత్ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.6.80 కోట్ల నిధులు

- మంత్రి సీతక్కకు ఘన సన్మానం



ములుగు, నవంబర్ 6,మనం ప్రతినిధి: మంగపేట మండలంలోని గిరిజన గూడాల అభివృద్ధికి ట్రైబల్ వెల్ఫేర్ గ్రాంట్ ద్వారా ఎస్టీ సబ్ప్లాన్ నిధుల నుంచి అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.6.80 కోట్ల భారీ నిధులు కేటాయించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంగపేట మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.6.80 కోట్ల నిధులు కేటాయించడం పట్ల మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు,అభినందనలు తెలిపారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై మంత్రి చూపుతున్న ప్రత్యేక చొరవ,గిరిజన ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క నాయకత్వంలో మంగపేట మండలం అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోందని,కేటాయించిన నిధులతో గిరిజన గూడాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి గ్రామాల రూపురేఖలు మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ,ప్రజల అవసరాలను గుర్తించి భారీగా నిధులు కేటాయించిన మంత్రి సీతక్కకు మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమరం సారయ్య,మాజీ ఎంపీటీసీ,ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలయ్య,బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ సున్నం ఆనంద్,కబ్బాక లక్ష్మణ్, కురసం రమేష్,కోరం లక్ష్మీపతి,పోదేం నాగేష్,కొమరం నాగేశ్వరరావు,కోరేం మొగిలి,చీమల శ్రీను,మోడెం సత్యం,యాలం నాగేష్,పునేం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క చొరవతో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు



మంగపేట,నవంబర్ 06 మనం ప్రతినిధి: శుక్రవారం మంగపేట మండలంలోని రామచంద్రునిపేట గ్రామంలో నూతన విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమి హక్కు పత్రాలు,గ్రామసభ తీర్మాన ప్రతులను మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి మండల కార్యాలయంలో ఎమ్మార్వో తోట రవీందర్ సమక్షంలో విద్యుత్ శాఖ డీఈ పూర్ణచందర్కు అందజేశారు. రామచంద్రునిపేట గ్రామంలో సబ్స్టేషన్ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రూ.3 కోట్ల 24 లక్షల 72 వేల నిధులను కేటాయించారు. రాజుపేట కేంద్రంగా రామచంద్రునిపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఈ సబ్స్టేషన్ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్తో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు మార్గం సుగమం కానుంది. ముఖ్యంగా రైతులు, గృహ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు తగ్గున్నాయి. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మండలంలోని అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకు సాగుతున్నాయని, రామచంద్రునిపేట సబ్స్టేషన్ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, రామచం ద్రునిపేట మాజీ ఉప సర్పంచ్ వెంగల బుచ్చిరెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది,నాయకులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక చేయూత



- నిరుపేద కుటుంబానికి అండగా సీతక్క
- ఏటూరునాగారంలో పేద కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సహాయం

ఏటూరునాగారం, నవంబర్6(మనంన్యూస్): నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రూ.30,000 ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి వివాహ సమయంలో అండగా నిలిచి తన వంతు సహాయం అందించారు. ఆడబిడ్డ వివాహం ప్రతి తల్లిదండ్రికి ఎంతో ముఖ్యమైన బాధ్యత. అలాంటి సమయంలో ఆర్థిక ఇబ్బందులను గుర్తించి సహాయం అందించడం ఆ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది. పేద ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, ఆపద సమయంలో అండగా నిలిచిన మంత్రి సీతక్కకు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సేవే లక్ష్యంగా నిరుపేద కుటుంబాల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్న సీతక్కకు పలువురు ధన్యవాదాలు తెలియజేశారు.

కుసుమ సాగుతో రైతులకు అధిక ఆదాయం



- తక్కువ నీటితో మంచి దిగుబడి
- ఎల్నినో పరిస్థితుల్లో వర్షాధార పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- డాక్టర్ ఆర్. విశ్వతేజ

కన్నాయిగూడెం, నవంబరు 6 (మనం న్యూస్): ప్రస్తుత ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి వినియోగాన్ని తగ్గిస్తూ వర్షాధార పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ములుగు శాస్త్రవేత్తలు సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం కన్నాయిగూడెం రైతు వేదికలో కుసుమ పంట సాగుపై రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ములుగు శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. విశ్వతేజ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే వర్షాధార పంటలను ఎంచుకోవడం రైతులకు మేలని సూచించారు. ముఖ్యంగా నూనెగింజ పంట అయిన కుసుమ సాగు ద్వారా తక్కువ నీటి వనరులతోనే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. కుసుమ పంటకు సాధారణంగా రెండు నుంచి మూడు తడులు అందిస్తే సరిపోతుందని వివరించారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకొని సాగు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ములుగు వారు గిరిజన ఉప ప్రణాళిక (ఖీళిఖ్) కింద అధిక దిగుబడినిచ్చే కుసుమ రకం ఐఖిఉ-764 విత్తనాలను 40 మంది గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కుసుమ సాగు విధానం, పంట యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగం, దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, ఏటూరునాగారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఆఅ) వేణుగోపాల్, కన్నాయిగూడెం మండల వ్యవసాయ అధికారి మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు (అఉలు), గిరిజన రైతులు పాల్గొన్నారు. తక్కువ నీటితో సాగు.. ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం: వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ నిపుణులు సూచించారు.

రామప్ప శిల్పకళ.. నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

కాకతీయుల నిర్మాణ కౌశలం అద్భుతం

ప్రసాద్ పథకం పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్



ములుగు, నవంబర్ 6 మనం ప్రతినిధి: రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ కౌశలం నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కాకతీయుల కాలం నాటి ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ఆలయ నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, రామప్ప ఆలయ నిర్మాణ విశేషాలు, శిల్పకళా వైభవాన్ని వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకలు, ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన డోలరైట్, బసాల్ట్, ఇసుకరాయి, సాండ్బాక్స్ సాంకేతికత గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలను పరిశీలిస్తూ, వాటి విశేషాలను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆలయ చరిత్ర, నిర్మాణ ప్రత్యేకతలపై జిల్లా కలెక్టర్తో చర్చించారు.

శిల్పి పేరుతో ఆలయం ప్రాచుర్యం పొందడం రామప్ప ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఆలయ శిల్పాల్లో చరిత్ర, పురాణాలతోపాటు నాటి వస్త్రధారణ, కళలు, ఆటలకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించిన తీరు విశేషమని అన్నారు. ఆనాటి జీవన విధానాన్ని, కళా వైభవాన్ని శిల్పాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించిన వారసత్వ సంపద అమోఘమని కొనియాడారు.

అనంతరం ప్రసాద్ పథకం కింద చేపడుతున్న నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ఆలయ పరిసరాల్లో భక్తులు, పర్యాటకుల కోసం కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఎస్సై రాజు, డిప్యూటీ రేంజ్ అధికారి మధుబాబు, ఆర్ఐ రమేష్, జీపీఓ సూరయ్య, పర్యాటక పోలీసులు దశరథ్, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, బద్రు, రెవెన్యూ, పోలీసు, అటవీ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ.. వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు సంయుక్త ప్రణాళిక రూపొందించాలి
- గుత్తికోయలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి
- ములుగు ప్రకృతి సంపదను కాపాడుతూ పర్యాటక అభివృద్ధికి కృషి
- రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్



ములుగు, నవంబర్ 6,మనం ప్రతినిధి: అటవీ సంపదను కాపాడుతూ, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో సంయుక్త ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

శుక్రవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి తాడ్వాయి అటవీ ప్రాంతం, ఏటూరునాగారం అభయారణ్యం, జలగలంచ దుర్గం గుట్ట ప్రాంతం, కొండాయి ఫారెస్ట్ వాచ్ టవర్ గుత్తికోయ హాబిటేషన్ ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల విశిష్టతలు, అటవీ సంరక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, ప్రస్తుత పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుందరమైన ప్రకృతి, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల్లోని అటవీ అందాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నానని, అందులో భాగంగానే ఈ పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. దట్టమైన అడవులు, సమృద్ధమైన జీవవైవిధ్యం ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయని అన్నారు.

వన్యప్రాణులను వేటాడటం అమానవీయమని, చట్టవిరుద్ధమైన ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని తెలిపారు. ఇటీవల ఒక అడవి దున్నను వేటాడిన ఘటనను జిల్లా అటవీ అధికారి తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వేటను అరికట్టేందుకు పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

అటవీ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత వేగంగా స్పందించడం ఎంత అవసరమో, అసలు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. వన్యప్రాణుల వేట, అగ్ని ప్రమాదాల నివారణకు కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, అటవీ సంరక్షణాధికారులు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

గుత్తికోయల గుంపును సందర్శించి, వారి జీవన పరిస్థితులు, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. అడవులను నరికివేయకుండా జీవనోపాధి పొందేందుకు వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అడవులను నరికివేయడం చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారికి వివరించారు. అటవీ సంపదకు నష్టం కలిగించకుండా ఇతర ఉపాధి మార్గాల ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. అభయారణ్యాన్ని మరింత మెరుగ్గా సంరక్షిస్తూ అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి, అటవీ సంపదతోపాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలు ములుగు జిల్లాలో ఉన్నాయని అన్నారు. అటవీ సంరక్షణ, పర్యాటక అభివృద్ధి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే జిల్లాలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యటనలో పరిశీలించిన అంశాలపై రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్కతో చర్చించి, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్కు తిరిగి వెళ్లిన అనంతరం జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎల్నినో ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరమని జయేశ్ రంజన్ తెలిపారు. వచ్చే నెల హైదరాబాద్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్లో ఈ అంశంపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, అటవీ జీవులతోపాటు అధిక ఉష్ణోగ్రతల్లో ఆరుబయట పనిచేసే కార్మికులు, గిగ్ వర్కర్లపై పడే ప్రభావాలను చర్చించనున్నట్లు వివరించారు. నిపుణుల సలహాలు, ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా తక్షణ, ఏడాది, ఐదేళ్ల కాలానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభావం తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే సన్నద్ధమవుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామాయణ చూడండి -సందీప్ వంగా



భారీ స్థాయిలో విడుదలైన 'రామాయణ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించగా.. తాజాగా దర్శకుడు సందీప్ వంగా దీనిపై రివ్యూ ఇచ్చారు. ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని తెలిపారు.

రాముడు, రావణుడి పాత్రల అసలైన వైభవాన్ని, వారి శక్తిని తెలుసుకోవాలంటే కచ్చితంగా 'రామాయణ్ణ సినిమా చూడాలని సూచించారు. రణ్‌బీర్, యశ్ ఇద్దరూ అద్భుతంగా నటించారని.. వారి పాత్రలకు ప్రాణం పోశారని ప్రశంసించారు. ''నాకు 'రామాయణ్ణ చాలా నచ్చింది. ఇలాంటి అంకితభావంతో పనిచేసే నిర్మాతను నేనెప్పుడూ చూడలేదన్న అంటూ నిర్మాత నమిత్ మల్హోత్రను సందీప్ కొనియాడారు.

మహేశ్ బాబు కూడా తాజాగా 'రామాయణపై రివ్యూ ఇచ్చారు. ''మనం చిన్నప్పటి నుంచి వింటూ వచ్చిన కథలు వెండితెరపై ఇంత అందంగా రూపుదిద్దుకోవడం.. నాకు చాలా ఆనందాన్నిస్తోంది. రణబీర్, యశ్, సాయి పల్లవి అద్భుతంగా నటించారన్న అని కొనియాడారు.

ఎస్.ఎస్.రాజమౌళి కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు. అత్యున్నత హంగులు, వెండితెరపై ఆవిష్కరించిన అద్భుతమైన విజువల్స్ కనువిందు చేస్తున్నాయని తెలిపారు. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఆస్వాదించానన్నారు.

వర్షం ముప్పు



ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్,న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన రెండో వన్డే రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శనివారం వెల్లింగ్టన్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ వర్షంతో టాస్ పడకుండానే తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం వెల్లింగ్టన్లో భారీ వర్షం కురుస్తోంది. దాంతో శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌ను భారత్ రద్దు చేసుకోగా.. న్యూజిలాండ్ ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. శనివారం తొలి అర్ధ భాగంలో 60 శాతం.. సెకండ్‌ఫ్‌లో 55 శాతం వర్షం పడే అవకాశం ఉందని ఎసీ సీయూ వెదర్ పేర్కొంది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేకు కూడా వర్షం అంతరాయం కలిగించిన సంగతి తెలిసిందే.

ఆర్యవీర్ సెహ్వాగ్ సూపర్ ఇన్నింగ్స్



తండ్రి వారసత్వం అందిపుచ్చుకున్న ఆర్యవీర్

ఎసీసీ మెన్స్ యూ19 ఏషియా కప్ 2026 టోర్నీని భారత యూ19 జట్టు ఘన విజయంతో ఆరంభించింది. నేపాల్తో జరిగిన మ్యాచ్లో 10 వికెట్ల తేడాతో భారీ విజయం అందుకుంది భారత యువ జట్టు. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టు 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నీరజ్ కుమార్ యాదవ్ 48 బంతుల్లో 3 ఫోర్లతో 20 పరుగులు చేయగా దర్శ్ సోనర్ 43 పరుగులు చేయగా ఆశీష్ లోహర్ 29 పరుగులు చేశాడు.

ఈ లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో ఛేదించింది భారత యూ19 జట్టు. కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయిచందని 63 బంతుల్లో 7 ఫోర్లతో 53 పరుగులు చేయగా ఆర్యవీర్ సెహ్వాగ్ 52 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 70 పరుగులు చేశాడు.

భారత యూ19 జట్టు, తన తర్వాతి మ్యాచ్ను నవంబర్ 8న పాకిస్తాన్ యూ19 జట్టుతో ఆడుతుంది. ఆ తర్వాత నవంబర్ 10న యూఏఈతో మ్యాచ్ ఆడుతుంది భారత యూ19 జట్టు.

ఎసీసీ మెన్స్ అండర్ 19 ఏషియా కప్ 2026 టోర్నీకి ఎంపిక చేసిన జట్టులో సెహ్వాగ్ కొడుకు ఆర్యవీర్ సెహ్వాగ్, రాహుల్ ద్రావిడ్ కొడుకు అన్వయ్ ద్రావిడ్కు చోటు దక్కింది. ఆర్యవీర్ సెహ్వాగ్, తండ్రి సెహ్వాగ్లాగే ఓపెనింగ్ బ్యాటర్.

వినూ మన్కడ్ ట్రోఫీలో ఛత్తీస్‌గఢ్తో మ్యాచ్లో 143 బంతుల్లో 173 పరుగులు చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్, అంతకుముందు కూచ్ బెహర్ ట్రోఫీ టోర్నీలో 7 ఇన్నింగ్స్లో 496 పరుగులు చేశాడు. మేఘాలయతో మ్యాచ్లో 297 పరుగులు చేసి, త్రిబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఆస్ట్రేలియా అండర్ 19 టీమ్తో మ్యాచ్లోనూ ఆడాడు ఆర్యవీర్ సెహ్వాగ్.

అయ్యర్ అదరగొట్టాడు



టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్పై వన్డే కెప్టెన్ శుభ్మన్ గిల్ ప్రశంసల జల్లు కురిపించాడు. అద్భుతమైన సారథ్యంతో టీ20 సిరీస్ గెలిపించాడని కొనియాడాడు. క్లిష్ట పరిస్థితుల్లో పుంజుకొని శ్రేయస్ అయ్యర్ అందించిన విజయం తనకు గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్తో రెండో వన్డేకు ముందు బీసీసీఐ షేర్ చేసిన వీడియోలో మాట్లాడిన శుభ్మన్ గిల్.. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'టీ20 సిరీస్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా నడిపించాడు. న్యూజిలాండ్లో తొలి రెండు మ్యాచ్లు గెలవడం అంత ఈజీ కాదు. ఈ రెండు మ్యాచ్లో ఎదురైన క్లిష్ట పరిస్థితులను టీమిండియా ఎదుర్కొన్న తీరు అద్భుతం. ఇలాంటి విజయాలు జట్టు మొత్తానికి స్ఫూర్తినిస్తాయి. టీ20 సిరీస్ను 3-2తో గెలవడంతో వన్డే సిరీస్కు కావాల్సిన మంచి ఊపు మాకు లభించింది.2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్, నవంబర్ నెలలో జరుగుతుంది.

జాన్వీకి రెజీనా కౌంటర్!

ఇండస్ట్రీలో మహిళా నటులపై వివక్ష చూపుతున్నారంటూ చర్చ జరుగుతోన్న వేళ.. నటి రెజీనా కసాండ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించిన 'కేసరి 2 సినిమాలో నటించినప్పటికీ.. తనకు కనీస ప్రమోషన్ కూడా కల్పించలేదని ఆరోపించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ తనకు ఎదురైన అనుభవాలను వెల్లడించారు. సౌత్ ఇండస్ట్రీలో తన అభిప్రాయాలను చెప్పడానికి అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు.

నన్ను సౌత్ ఇండియన్ అంటూ పక్కన పెట్టారు

దీనిపై రెజీనా స్పందించారు. అయితే, ధర్మ ప్రొడక్షన్స్ సినిమాలో తనకు జరిగిన అన్యాయంపై ఎవరు మాట్లాడతారని ప్రశ్నించారు.'కేసరి 2 సినిమాలో అక్షయ్ కుమార్ భార్యగా తాను కీలక పాత్ర పోషించానని, అయినప్పటికీ సినిమా ప్రమోషన్లలో తనకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని రెజీనా ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా నుంచి విడుదలైన ఓ పాటలో మొదటి నుంచి చివరి వరకు తానే కనిపించినప్పటికీ.. సోషల్ మీడియాలో కనీసం తనను ట్యాగ్ కూడా చేయలేదన్నారు. ఈ విషయంపై ధర్మ ప్రొడక్షన్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి వివరణ రాలేదని వెల్లడించారు. అంతేకాదు, బాలీవుడ్లో సౌత్ ఇండియన్ నటుల పట్ల వివక్ష ఉంటుందని రెజీనా అభిప్రాయపడ్డారు. ఉత్తరాదికి వెళ్లినప్పుడు తనను ఒక సౌత్ ఇండియన్ నటిగానే చూస్తారని, అందుకే తగిన ప్రాధాన్యత లభించదని అన్నారు. తనకు తమిళం కంటే హిందీ బాగా వచ్చని, అయినప్పటికీ ప్రాంతీయ గుర్తింపుతో వివక్ష ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో మహిళలు తమకు ఎదురైన ఇబ్బందుల గురించి ధైర్యంగా మాట్లాడాలని రెజీనా తెలిపారు. అయితే ఈ అంశాన్ని ఉత్తరాది-దక్షిణాది అని విడదీసి చూడొద్దని సూచించారు. ఇలాంటి చర్చలు పరిశ్రమలో ప్రాంతీయ విభేదాలను పెంచుతాయన్నారు. జాన్వీ కపూర్, రాధిక ఆప్టే వారి అనుభవాలను బయటపెట్టడాన్ని తాను అర్థం చేసుకోగలనని రెజీనా చెప్పారు. గతంలోనూ ఎంతోమంది హీరోయిన్లు వయసులో పెద్ద హీరోలతో నటించారని గుర్తుచేశారు.

నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?

విడాకులపై రేణుదేశాయ్ కామెంట్స్ వైరల్



నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. విడాకులు తీసుకుని 14 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా, పవన్ కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తున్నారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితం, ఎదుర్కొంటున్న విమర్శలు, సోషల్ మీడియా ట్రోల్స్పి ఓ ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు.

''తెలుగు వాళ్లందరికీ ఒక విషయం చెప్పాలి. 'బద్రి సినిమాతోనే నా జీవితం మొదలైందని చాలామంది అనుకుంటారు. అంతకుముందు నాకు ఎలాంటి జీవితమే లేనట్టుగా చూస్తున్నారు. మాకు విడాకులు వచ్చి 14 ఏళ్లు గడిచిపోయాయి. శ్రీరాముడు కూడా వనవాసం 14 ఏళ్లే చేశాడు. మరి నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది? అని ప్రశ్నించారు.

విడాకుల తర్వాత తాను సాధించిన విజయాల గురించి మాట్లాడుతూ.. ''2012లో విడాకులు మంజూరు అయ్యాక.. నేను ఒక మరాఠీ సినిమా నిర్మించాను. అది సూపర్ హిట్ అయింది. మరో సినిమాకు కథ రాసి, నిర్మించి, దర్శకత్వం కూడా వహించాను. డ్యాన్స్ షోలకూ వర్క్ చేశాను. కవితలూ రాశాను. ఇప్పుడూ సినిమాల్లో నటిస్తున్నాను. నాకంటూ ప్రత్యేక వ్యక్తిగత గుర్తింపు లేకపోతే నాకు ఈ అవకాశాలు ఎందుకు వస్తాయ్ని అని అడిగారు. ఇక సోషల్ మీడియాలో విమర్శలపై స్పందిస్తూ.. ''నేను కుక్కను కాపాడినా నన్ను తిడుతున్నారు. ఆయన లేకపోతే ఆమెకు జీవించే అర్హతే లేదు అన్నట్లుగా మాట్లాడుతార్ణ అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రేణూ దేశాయ్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

రాయడం ఎంతో ఇష్టం కానీ.. ఆ సంఘటన తర్వాత మానేశా!

ఆచితూచి కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన చిత్రాలతో భాషలతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయిక కీర్తి సురేశ్. సెటైర్స్ పై 'రౌడీ జనార్ధన, 'జనవరి 12 విడుదల్ణ, 'సత్యవాన్ సావిత్రి, 'రాఫ్తార్ లాంటి పలు చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె.. ప్రస్తుతం 'అక్క సిరీస్తో ఓటీటీ వేదికగా సందడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి.. తానొకప్పుడు ఇష్టంగా డైరీ రాసేవారని, జీవితంలో జరిగిన ఒక సంఘటన తర్వాత రాయడమే మానేశానంటూ కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకున్నారు.

''నాకు ఎప్పుడూ నటించాలనే కోరిక ఉండేది. కానీ మంచి నటిని కాలేనేమోనని ముందు చదువుకోమన్నారు మా నాన్న. ఒకరోజు దర్శకుడు ప్రియదర్శన్ నన్ను చిత్రపరిశ్రమకు పరిచయం చేయాలని అనుకుంటున్నానని తనదైన శైలిలో నాన్నని అడిగారు. 'మీకు తెలుసా నేనొక అమ్మాయిని చూశాను. ఆమెను నటిగా పరిచయం చేయాలనుకుంటున్నా. కానీ ఆమె తండ్రి దానికి అంత ఆసక్తిగా లేరని నాకు అనిపిస్తోంద్ని అని నాన్నతో అన్నారు ప్రియదర్శన్. దాంతో మా నాన్న 'ఆ వ్యక్తి ఎవరో చెప్పండి నేను వెళ్లి మాట్లాడతాన్న అన్నారు. అప్పుడు ఆయన 'నువ్వే అన్నారు. అలా ప్రియదర్శన్ 'గీతాంజళ్ని చిత్రంతో మొదలైంది నా ప్రయాణం. మోహన్లాల్తో నటించాను. ఇంతకంటే మంచి ఆరంభం నాకు దొరకదు. ఆయన నా గురువు.

పెళ్లి విషయంలో ఎన్నో సవాళ్లు ''నా పెళ్లి గురించి మా కుటుంబాన్ని ఒప్పించే క్రమంలో ఎన్నో సవాళ్లని ఎదుర్కొన్నాను. ఇద్దరివీ వేరు వేరు మతాలు కావడంతో ఇంట్లో సహజంగానే సమస్యలు వచ్చాయి. నేను, ఆంటోని ఇంటర్ తర్వాత నుంచి ప్రేమించుకోవడం మొదలుపెట్టాం. నేను నటిని కాకముందే ఆంటోని నన్ను చూశారు. అదే మా మధ్య మంచి విషయం. ఒకసారి నేను కాలేజీలో ఉన్నప్పుడు మా అమ్మ నా డైరీ చదివింది. అందులో మా బంధానికి సంబంధించిన ప్రతి విషయం ఉంది. 'నేను నీ తల్లినే కదా్ణ అనే ఉద్దేశంలో అమ్మ ఆ డైరీ చదివి ఉండొచ్చు. కానీ ఆ సంఘటన తర్వాత డైరీ రాయడం మానేశాను. నాకు రాయడం అంటే చాలా ఇష్టం. ఇప్పుడా డైరీ ఎక్కడుందో కూడా తెలీదు. అది తిరిగి దొరికితే బాగుంటుంది. కానీ మా అమ్మ దాన్ని కాల్చేసిందేమో అనిపిస్తుంది అని అన్నారు.

నిశ్చితార్థం పూర్తి... డిసెంబర్లో వివాహం



యువ కథానాయకుడు సాయి దుర్గా తేజ్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. తన స్నేహితురాలు కిరణ్తో ఆయన కొత్త జీవితాన్ని ఆరంభించనున్నారు. గురువారం హైదరాబాద్లోని ఓ రిసార్ట్లో ఈ జంటకు ఇరు కుటుంబాల సమక్షంలో వివాహ నిశ్చితార్థం జరిగింది. కలిసి జీవితాన్ని పంచుకోనున్న ఈ జంట ఒకరికొకరు ఉంగరాలు మార్చుకున్నారు.

ఈ వేడుకలో చిరంజీవి, అల్లు అరవింద్ కుటుంబ సభ్యులతో పాటు కొందరు సినీ ప్రముఖులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. డిసెంబరు 10న హైదరాబాద్లోనే వీరి వివాహం జరగనుంది. త్వరలోనే సాయి 'ఎస్.వై.జి: సంబరాల ఏటిగట్టు చిత్రంతో సందడి చేయనున్నారు. ప్రస్తుతం తేజ కాకుమాను దర్శకత్వంలో ఓ కొత్త సినిమాలో నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.